# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 సంచిక : 5 విజయవాడ 5-7-2011 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- అనైతిక ఔషధ ప్రయోగాలు-పాలకుల నయాఉదారవాద దుష్ట విధానాల ఫలితాలు
- కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్ళను ప్రతిఫలిస్తున్న 'మారుతీ' కార్మికుల సమ్మె
- చేనేత రంగం రక్షణకై ఉద్యమిద్దాం- ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం పిలుపు


# మళ్లీ పెట్రో ధరల మంటల్లో ప్రజలు

**ఐదు రాష్ట్రాల్లో** శాసనసభలకు ఎన్నికలు ముగిసే వరకూ ఆగిన ప్రభుత్వం ఒక్కసారిగా పెట్రోధరలను పెంచివేసింది. డీజిలుపై 3/-రూ॥లు, కిరోసిన్‌పై 2/- రూ॥లు, వంటగ్యాస్‌పై 50/-రూ॥లు పెంచింది. ఈ పెంపుదలవల్ల ప్రజల మీద పడే అదనపు భారం ప్రభుత్వం చెప్పిన ప్రకారం 21 వేల కోట్ల రూపాయలనుకున్నా సగటున ప్రతికుటుంబంపై వెయ్యి రూ॥లూ, లేదా ప్రతి పౌరుడిపై 175/- రూ॥లు అదనపు భారం పడింది. ఇక పరోక్ష భారం లెక్కలకందదు. డీజిలుధర పెరగటంతో రవాణా ఛార్జీలూ, వ్యవసాయ ఖర్చులూ పెరిగి ఆహారధరలు ఎన్నోరెట్లు పెరుగుతాయి ఇక ప్రయాణఛార్జీల భారం సరేసరి. రోజురోజుకూ పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి పెట్రోధరలు తోడై అన్ని సరుకుల ధరలూ కళ్లాలు లేని గుర్రంలా పరుగులు తీస్తాయి. ఈ పెట్రోధరల పెంపుదల సామాన్యపౌరుడి జీవనాన్ని దుర్భరం చేస్తుందన్నది స్పష్టం.

ఏడేళ్ళ పాలనలో యుపిఏ ప్రభుత్వం 21సార్లు పెట్రో ధరలను పెంచింది. ఈ కాలంలో డీజిలు ధర 12 రూ॥లూ, వంటగ్యాస్ ధర 155 రూ॥లు పెట్రోలు ధర 27 రూ॥లూ, కిరోసిన్ ధర 8 రూ॥లు పెంచివేసింది. ఇలా పెంచిన ప్రతి సందర్భంలోనూ పెట్రోకంపెనీల ఆదాయం పెరగటంతోపాటు ప్రభుత్వ పన్నుల ఆదాయం కూడా పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టి ధరలు పెరగకుండా చూస్తానన్న ప్రభుత్వపు మాటలన్నీ కల్లలనీ, ద్రవ్యోల్బణాన్ని పెంచే చర్యలనే ప్రభుత్వం తీసుకుంటుందనీ స్పష్టమే.

పెట్రోధరల పెంపుదలను సమర్థించుకుంటూ ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనంతా తన కనుకూలంగా అర్ధసత్యాలతో నింపివేసింది. మన పొరుగు దేశాలకన్నా మన పెట్రోధరలు చాల తక్కువని వాదించింది. పొరుగు దేశాలలో డీజిలు ధర మనకన్నా ఎక్కువన్నమాట నిజమే అయితే పెట్రోలు ధర తక్కువుంది. ఒకదేశంలో వంట గ్యాసు ధర తక్కువుంటే, అక్కడ కిరోసిన్ ధర తక్కువ తన ధర పెంపుదలను సమర్థించే విధంగా కొన్ని ధరలను పేర్కొనటం చేసింది. వారి వారి పరిస్థితులను బట్టి ఆయా దేశాలు ధరలు నిర్ణయించుకుంటున్నాయన్నది వాస్తవం. విదేశాలతో పోలికతెస్తున్న ప్రభుత్వం అనేకదేశాలు రైతాంగానికి డీజిలు చవక ధరకు యిస్తున్న అంశంలోనూ, (కజకస్తాన్, థాయిలాండ్) జపాను వంటి ధనిక దేశంలో పెట్రోఉత్పత్తులపై పన్నులు మనతో పోలిస్తే చాల తక్కువన్న అంశాలలోనూ పోలికతెచ్చుకోదు.

ప్రభుత్వం పెట్రోధరలను నియంత్రిస్తున్నందున, ముడి చమురు ధరలు పెరుగుతున్నందున పెట్రో కంపెనీలకు నష్టాలు వస్తున్నాయనీ, కనుక ధర పెంచక తప్పదనీ వాదించింది. ఇది అబద్ధపువాదన. పెట్రోలియం వెలికి తీసే ఓఎన్‌జిసి, రిఫైనరీలున్న ఆయిల్ ఇండియా, హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికీ కలిపి 2006-10 మధ్య ఆర్జించిన నికరలాభం రూ॥ 1,26,288 కోట్లు. డీజిలు, వంటగ్యాసు, కిరోసిను వంటి ధరలను నియంత్రించినందున వాటి ఉత్పత్తి ఖర్చుకంటే తక్కువకే ధరకే అమ్మాల్సివచ్చినందున వాటిపై నష్టం వచ్చిందనుకున్నా, ఈ క్రమంలో వచ్చే మిగిలిన ఉత్పత్తులతో కలిపిన అమ్మకాలతో చూస్తే నికరలాభమే వచ్చింది. గనుక నష్టాలు వచ్చాయన్న వాదన సరికాదు. పోనీ పెట్రో మార్కెటింగు కంపెనీలకే నష్టాలు వచ్చాయనుకున్నా ఆ రంగంలో ఐఓసి, బిపిఎల్, హెచ్‌పిసిఎల్‌కంపెనీలకు 2010-11 ఆర్థిక సంవత్సరంలో రూ॥ 10,153 కోట్ల రూ॥ల నికరలాభం వచ్చినట్లు వాటి వార్షిక నివేదికలే తెలుపుతున్నాయి. మరి నష్టాలని ప్రభుత్వమెలా అంటున్నది? డీజిలు, వంటగ్యాసు, కిరోసిన్‌కూడా ఎక్కువ ధరకు అమ్ముకోనిచ్చివుంటే రాగల ఆదాయం రాకుండా పోయిందన్న దానినే నష్టంగా అవి లెక్క చూపుతుంటే ప్రభుత్వం ఆ మాటలనే మనకు చెబుతున్నది. ఈ ఆరోపణ నేను చేస్తున్నది కాదు-అనుకున్న ఆదాయం రాకపోవటాన్నే నష్టాలుగా చెప్పుకుంటున్నాయని రంగరాజన్ కమిటీయే తెగేసి చెప్పింది.

మొత్తం భారం ప్రజలపై పడకుండా కొన్ని పన్నులను తగ్గించుకొని తాను 49వేల కోట్ల రూ॥ల ఆదాయాన్ని వదులుకున్నానని ప్రభుత్వం చెబుతున్నది. అయితే ధర పెంచినందునా, పన్నులతగ్గించినందునా తమకు అదనంగా వచ్చే ఆదాయం 21వేల కోట్లరూ॥లని మార్కెటింగ్ కంపెనీలు ఎలా పేర్కొన్నాయి? తేడా 38వేల కోట్ల రూ॥లు ఎక్కడికి పోయాయి? పన్నుల విధింపు అడ్‌వాలోరం పద్ధతిలో వున్నందున పెట్రో ఉత్పత్తుల ధర పెరిగినప్పుడు పన్నులు కూడా పెరుగుతాయి. అందువల్ల కొంత శాతం పన్ను తగ్గించినా మొత్తం పన్ను ఆదాయం తగ్గదు. కొండొకచో పెరుగుతుంది కూడా. కనుక ప్రభుత్వం చెబుతున్న నష్టాలు ఉహాజనితం (నోషనల్). పన్నురేటు తగ్గించకుండా వుండివుంటే వచ్చివుండే ఆదాయంతో పోల్చి అదంతా నష్టపోయామని చెప్పే మాట. ఇదికూడా నా ఆరోపణ కాదు. గతంలో రంగరాజన్ కమిటియే వేలెత్తి చూపింది. పెట్రోలు, డీజిలుపై పన్నులతో పాటు వంటగ్యాసు కిరోసిన్‌ను కూడా వదల కుండా పన్నులు దండుకుంటున్నారని చెప్పింది. 2006-10 మధ్య నాలుగేళ్లకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల ద్వారా పొందిన మొత్తం ఆదాయం ఆరున్నర లక్షల కోట్ల రూపాయలు. దీనిలో ఈ రంగానికి యిచ్చామంటున్న, ఆభారం మోయలేని దయిందని గగ్గోలు పెడుతూవుండిన సబ్సిడీ 5 శాతంలోపే కనుక పెట్రోరంగం ప్రభుత్వానికి బంగారు గుడ్లు పెట్టే బాతు. నష్టాలు తెచ్చేదికాదు.

బంగారు గుడ్లు పెట్టే బాతుని ఒక్కసారిగా చంపివేసే తెలివిహీనుడుకాదు ప్రభుత్వం. పెట్రోరంగంపై నియంత్రణ వదులుకుని రేటు నిర్ణయాన్ని మార్కెట్టు శక్తులకే వదిలి వేయమని ఆర్థిక నిపుణులు ఎన్నిసార్లు సలహాలిచ్చినా, బూర్జువా పత్రికలు నియంత్రణను వదలుకోనందుకు ఎంత విమర్శించినా, ప్రభుత్వం ఆ పని చేస్తానంటూనే, చేస్తూన్నట్లు కన్పిస్తూ చేయకుండా వుండటానికి ఇదే కారణం. విడతలు విడతలుగా ధరలు పెంచుకుంటూపోయి. జనం మూలుగులు నెమ్మదిగా పీల్చివేసే విధానాన్ని అనుసరిస్తున్నారు.

గతంలో పెట్రోధరలు పెంచినప్పుడు, వినియోగదారులకు ధరలు పెంచకుండా, కేంద్ర, రాష్ట్రాలు పన్నులు తగ్గించుకుని, ఆయిలు కంపెనీలకు నష్టాలు రాకుండా చేయటాన్ని పరిష్కారంగా ప్రభుత్వాన్ని విమర్శించే ఆర్థిక నిపుణులు సూచిస్తూ వచ్చారు. ఆ వాదన అందుకుని ప్రతిపక్షాల పాలనలో వున్న రాష్ట్రాలు కేంద్రాన్ని పన్నులు తగ్గించమని యాగీ చేసాయి. కేంద్రాన్ని తగ్గించమంటారెందుకూ రాష్ట్రాలే తగ్గించవచ్చుగదా అంటూ కేంద్రం ప్రతిదాడికి దిగింది. ఎవరూ తగ్గించిందిలేదు.

ఇప్పుడు ఎత్తుగడలు మారాయి. నేను సుంకాలు తగ్గించాను రాష్ట్రాలు కూడా అమ్మకం పన్ను తగ్గించి ప్రజలపైభారం తగ్గించడంటూ కేంద్రం దాడికి దిగింది. దీనితో కొన్ని రాష్ట్రాలు తగ్గిస్తామంటూ ప్రకటనలు చేశాయి. తగ్గించానన్న సుంకం ద్వారా మొత్తం ఆదాయం తగ్గకుండా కేంద్రం అనుసరించిన దారినే రాష్ట్రాలు అనుసరించాయి. **(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

# నేతి బీర ప్రజాస్వామ్యం

**భారతదేశం** ఒక ప్రజాస్వామిక వ్యవస్థను కలిగివుందనీ, దానికి మూలస్థంభాలైన పార్లమెంటు, న్యాయవ్యవస్థ, కార్యనిర్వహణా వర్గాలతోపాటు వార్తా ప్రసార సాధనాలు 60 ఏళ్లనుండీ రాజ్యాంగ చట్టం గొడుగుక్రింద పరిఢవిల్లడమే దానికి సాక్ష్యమనీ, ఈ కాలంలో ఎన్ని సంక్షోభాలు వచ్చినా ఈ వ్యవస్థలు నిలదొక్కుకుని ప్రజాస్వామ్యవ్యవస్థ ఉత్కృష్ఠతను చాటాయనీ, లోటుపాట్లున్నా సార్వత్రిక ఓటుహక్కుతో ఎన్నికలు జరిగి, ఎన్నికయిన ప్రభుత్వాల పాలన సాగటమే దీనికి రుజువనీ ఎడతెగని ప్రచారాన్ని పాలకపార్టీలు, పాలకవర్గాలు సాగిస్తున్నాయి.

అయితే ఆ రాజ్యాంగ చట్టం ప్రకారమే, వాటి మూలస్థంభాల అనుమతితోనే, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంచేసి నిరంకుశపాలనను తెచ్చిన అత్యవసర పరిస్థితికి 36 ఏళ్లు నిండాయన్నది గుర్తుచేసుకోవటాన్ని కూడా మానివేశారు. దీనితోపాటు పౌరసమాజం పేరిట సాగుతున్న తంతు, దాని పాటకు తాళంవేస్తున్న పాలకవర్గ పార్టీలతీరూ నిజమైన అర్థంలో ప్రజాస్వామ్యంపట్ల వీరెవరికీ ఏమాత్రం గౌరవం లేదని స్పష్టంచేస్తున్నాయి.

ఈ దేశంలో ప్రజాస్వామ్యమనేదే వుండి వుంటే, 63 ఏళ్ల స్వతంత్రపాలన తర్వాత ప్రజాస్వామిక వ్యవస్థ అంగాలన్నవి బలపడి ప్రజాజీవితాన్ని ప్రభావితం చేస్తూ వుండాలి. కానీ 30 ఏళ్లు దాటకుండానే పార్లమెంటును రబ్బరుస్టాంపుచేసి, రాజకీయ నాయకులకు లొంగివుండే న్యాయవ్యవస్థ కావాలన్న ఎమర్జెన్సీ పాలన తెచ్చిన నిర్బంధ చట్టాలన్నీ, ఆ చీకటి పాలన ముగిసిందన్న తర్వాత దుస్తులు మార్చుకుని కోరలు తగిలించుకుని చిలవలుపలవులుగా రాజ్యమేలుతున్నాయి. మీసా చట్టం నాసా చట్టమైంది. ఎస్మా చట్టం కోరలు తగిలించుకుంది. ఆర్థిక నేరాలూ, టెర్రరిజం పేరిట పోటా, అక్టా పేరిట కేంద్రరాష్ట్రాల అసంఖ్యాక చట్టాలు ముందుకు వచ్చి ప్రజల ఊపిరులు తీస్తున్నాయి. ప్రజానిరసనను ప్రదర్శించే శాంతియుత రూపాలు కూడా, చివరకు రిలే నిరాహారదీక్షలు కూడా ప్రజాజీవనాన్ని భగ్నంచేసే చర్యలంటూ న్యాయస్థానాలనుండి నిషేధాలకు గురిఅవుతున్నాయి. పార్లమెంటుకు తెలుపకుండా, దాని ఆమోదం లేకుండానే అన్ని విధానాలనూ ప్రభుత్వాలే అమలు జరుపుకుంటూపోతున్నాయి. ఆ విధానాల మంచి చెడ్డలను చర్చించి ఆమోదించటమో, తిరస్కరించటమో చేయాల్సిన పార్లమెంటుకు ఆ విధానాలకు చట్టబద్ధత అన్న అలంకారపు ముసుగు తొడిగేందుకు చేతులెత్తటమే పనిగా మారింది.

సరిగ్గా ఈ సమయం వచ్చేసరికి గ్రామ పంచాయితీనుండి పార్లమెంటువరకూ వున్న సంస్థల నిరర్థకత గురించి మౌనం పాటిస్తూ, పౌర సమాజం గురించీ, ప్రజాస్వామ్యాన్ని రక్షించటంలో దాని పాత్ర గురించి చర్చించటం ముఖ్యాంశమైంది. ముక్కు మూసుకుని యోగాభ్యాసం చేసుకుంటూ చెట్ల ఆకుల పొడులమ్ముకుని వేలాది కోట్ల రూపాయలకు పడగలెత్తినవారు, తప్పుడు చట్టాన్ని చేయరాదని నిరసన ప్రదర్శన చేస్తున్న లాయర్ల వీపులను శాంతిభద్రతల పేరిట చితకబొడిపించిన పోలీసు ఆఫీసర్లు, నిర్బంధకాండ గురించి ఏనాడూ నోరువిప్పని అహింసావాదులు రాత్రికి రాత్రే పౌరసమాజంగా రూపాంతర మెత్తుతారు. ఇక వీరు చేసే పనులన్నీ వీరోచిత చర్యలవుతాయి.

60 ఏళ్ల ప్రజాస్వామిక వ్యవస్థలకు అవినీతిని అదుపుచేసే మార్గాలు తెలియదా అని ఎవరైనా ఆశ్చర్యపోవచ్చునన్న జంకుకూడా లేకుండా మంత్రులు ఉరుకులు పరుగులతో ఈ పౌరసమాజం చుట్టూ చేరారు. ప్రభుత్వం రూపొందించవలసిన చట్టాన్ని మీరు రూపొందించమంటూ కమిటీ పెట్టారు. చర్చలంటూ నానాతంతూ సాగించి, చివరకు పౌరసమాజం ప్రభుత్వాన్ని బ్లాకుమెయిలు చేస్తున్నదంటూ నిందలు వేయటం మొదలుపెట్టారు. పారదర్శకతంటూ ఇంతకు ముందు తెలియనట్లుగా పౌరసమాజమంటూ తాను పొగడి దండలేసిన బాబాకు కోట్ల ఆస్తులెలావచ్చాయంటూ ప్రశ్నిస్తారు. మళ్లీ నాలుగు రోజులు ఆ బాబా చుట్టూ తిరిగి ఒప్పందం కుదిరిందంటూ మా విజయమిదిగోనంటూ ఒప్పంద కాగితమన్న దానిని పత్రికావిలేఖరుల ముందు ఊపుకుంటూ తిరిగిన మంత్రులే బాబా బిజెపి చేతిబొమ్మంటూ గుడ్లు మిటకరిస్తారు. తిరిగి బాబా ఆమరణ నిరాహారదీక్ష ప్రకటిస్తే దానిని విరమించమంటూ మంత్రులు ఆయన చుట్టూ ప్రదక్షిణాలు చేస్తారు. చివరకు తనను రంగం నుండి ప్రక్కకు నెట్టేందుకే బాబాను ముందుకు తెస్తున్నారన్న అన్నాహజారే కూడా బాబాకు మద్దతుగా ఒకరోజు నిరాహారదీక్ష చేశారు. ఈ మొత్తం రగడతో బాబాపట్ల ప్రజల్లో ఆసక్తి తగ్గినట్లు అనిపించగానే మళ్లీ పోలీసులను పంపి అరెస్టు తతంగంతో హీరోను చేసారు. పౌరసమాజం పేరిట వీళ్లను హీరోలను చేసేదీ, ఆరోపణలతో వారిని జీరోలను చేసేదీ పాలకులే. పార్లమెంటువంటి అన్ని ప్రజాస్వామిక వ్యవస్థల వైఫల్యంతో విసుగుచెంది పౌరసమాజమన్న వ్యవస్థన్నా ప్రజాస్వామ్యమన్న దానిని తెచ్చేందుకు తోడ్పడుతుందేమోనన్న మధ్యతరగతి భద్రజీవుల ఆశలు కొడిగట్టకుండా, ఈడేరకుండా త్రిశంకు స్వర్గంలో వుంచేందుకు పాలకులాడుతున్న నాటకమిది. సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నడిచే పాలకులకు ఆ నడతను ప్రశ్నించే అవకాశమిచ్చే ఏ రూపమన్నా సరిపడదు. అతికొద్ది పరిమితుల్లోనైనా దాన్ని మననివ్వరు. నిజమైన ప్రజాస్వామ్య సూచన కనిపించినా వారు గంగవెర్రులవుతున్నారు. **(తరువాయి 2వ పేజీలో)**

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌కు జోహార్లు

**ప్రొఫెసర్** కొత్తపల్లి జయశంకర్ (76) సం॥లు 21-6-11న కాన్సర్ వ్యాధితో హైదరాబాద్ లో మరణించారు. అధ్యాపకులుగా, కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రారుగా, వైస్‌ఛాన్సలర్‌గా వివిధ హోదాలలో పనిచేసిన జయశంకర్ తన యవ్వన దశనుండీ తెలంగాణా ప్రజలు గురవుతున్న వెనకబాటుతనాన్ని గుర్తించాడు. దానిపై స్పందించారు. ఆ ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. వివక్షకు గురౌతున్న ప్రజల పక్షాన నిబద్ధతతో కడవరకు నిలచిన జయశంకర్ మరణానికి 'జనశక్తి' నివాళులర్పిస్తున్నది.

# విశ్వమోహనరెడ్డి నగర్ సమస్యల పరిష్కారానికై ఆందోళన

**పిడుగురాళ్ళ, 22-6-11 :**

2010 సంవత్సరంలో పిడుగురాళ్ళ పట్టణంలో గుంటూరురోడ్డులోని సున్నపు మిల్లుల ప్రాంతంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 500 కుటుంబాలతో విశ్వమోహనరెడ్డినగర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కాలనీలో స్వంత ఇల్లులేని నిరుపేదలు గుడిశెలు వేసుకొని కాలం గడుపుతున్నారు. సున్నపు మిల్లులలో పనిచేసే కార్మికులు, ముఠాకార్మికులు, హమాలీ వర్కర్సు, పూసలు, బొమ్మతోల్లు, కుంకుమ అమ్ముకొని జీవించేవారు, బొమ్మలాటవారు ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. కాలనీ వాసులే తమ కష్టార్జితంతోనే బోర్లు ఏర్పాటు చేసుకొని తాత్కాలికంగా తక్షణం కావాలసిన మంచినీటి వసతి కల్పించుకున్నారు.

22-6-2011న విశ్వమోహనరెడ్డినగర్ అభివృద్ధి మరియు సంక్షేమ కమిటి నాయకత్వాన కాలనీకి వెళ్ళుటకు దారి వసతి కల్పించాలని, కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఓటర్లుగా నమోదు చేసుకొని రేషన్ కార్డులు ఇవ్వాలని, వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ ఇవ్వాలని, పిల్లలకు చదువుకొనుటకు ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని పిడుగురాళ్ళ పట్టణంలో ప్రదర్శన నిర్వహించి స్థానిక తాసిల్దారు ఆఫీసువద్ద, విద్యుత్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించి సంబంధిత అధికారులకు మెమోరాండం ఇచ్చారు.

కాలనీకి దారి సమస్య పరిష్కారానికి, ఓటరు నమోదు చేసి రేషన్ కార్డుల మంజూరుకు తహసిల్దారు అంగీకరించారు. విద్యుత్ సమస్యను పరిష్కరించటానికి తగుచర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారు.

స్థానిక ఎమ్.ఎల్.ఏ. యరపతినేని శ్రీనివాసరావును కలసి ప్రజలు ఈ సమస్యలపై వివరించారు. ఎమ్.ఎల్.ఏ. నిధులద్వారా విద్యుత్ సౌకర్యమును ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ స్వామి; రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ రాంబాబు; స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు కా॥ నిర్మల; కాలనీ అభివృద్ధి కమిటి అధ్యక్షులు కా॥ పొలేశు, హమాలీ వర్కర్సు శ్రీను, సాంబయ్య, కోటేశ్వరరావు కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ✤

# 'విద్యాహక్కు చట్టం పేరిట కార్పోరేట్ విద్యాసంస్థల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయం'

**గుంటూరు, 15-6-11 :**

విద్యాహక్కు చట్టం నియమావళిని వ్యతిరేకిస్తూ పిడిఎస్ఒ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఎటి అగ్రహారం నుండి బయలుదేరి చుట్టుగుంట, రింగ్‌రోడ్డు, నగరంపాలెం, కలెక్టర్ ఆఫీసు రోడ్డు, కంకరగుంట గేటు వరకు కొనసాగింది. ఈ ప్రదర్శనలో విద్యా ప్రవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడదామని విద్యాహక్కు చట్ట నియమావళిని వ్యతిరేకించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, అందరికీ ఉచిత˘ నిర్బంధ విద్య అందించాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పిడిఎస్ఒ జిల్లా నాయకులు కె.వి. రమణారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక విద్యనుండి ఉన్నత విద్యారంగం వరకు ప్రైవేటు కార్పొరేటు విద్యా సంస్థలకు కట్టపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశ్యపూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. "స్వతంత్ర" భారతదేశంలో నేటికి కూడా ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించకపోవడం సిగ్గుచేటనీ, 2009 ఏప్రిల్ 10న రూపొందించిన విద్యా హక్కు చట్టం కార్పోరేటు విద్యా సంస్థలకు అనుకూలంగా ఉండే విధంగా రూపొందించి, పేద, దళిత, మధ్యతరగతి విద్యార్ధులకు విద్యను దూరం చేస్తున్నదన్నారు. విద్యాహక్కు చట్ట నియమావళి ప్రకారం 6-14 సం॥ పిల్లలకు ఉచిత నిర్బంద విద్యను అందిస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారనీ, అయితే పేద దళిత, మధ్య తరగతి విద్యార్ధులకు విద్యను అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నదనీ, కావున విద్యార్ధులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు, శ్రామిక ప్రజలు అందరు సంఘటితంగా విద్య కార్పోరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. ✤

**మళ్లీ పెట్రోధరల...** (మొదటి పేజీ తరువాయి)

అమ్మకం పన్నునుండి ఆదాయం పెరిగిన పెట్రో ధరలతో ఎంత పెరుగుతుందో లెక్కలు చూసుకొని ఆ పెరిగే ఆదాయంలో కొంత తగ్గే విధంగా పన్నురేటును తగ్గించామని ప్రకటనలిస్తున్నాయి. ఎత్తుగడలే మారాయి. ప్రజలను ఏమార్చజూస్తున్నాయి. కానీ పన్నుపోటు మాత్రం తగ్గలేదు.

పెట్రోధరల పెంపుతో ప్రజల జీవితాలపై పెనుభారాన్ని మోపుతూ, దాని నుండి దోపిడీ వర్గాలకు దోచిపెడుతున్న ప్రభుత్వ విధానాలపైనా, తన విధానాన్ని కప్పిపుచ్చుకుంటూ వితండవాదనలు ముందుకుతెచ్చి ప్రజల చేత ధరల పెంపుదల చేదు మాత్రను మింగించ చూస్తున్న ప్రభుత్వతీరుపైనా తమ విమర్శనను సాగిస్తూ, ధరల తగ్గింపుకు సంఘటిత పోరాటాలకు ప్రజలు సమాయత్తం కావాలి. ✤


వెలువడింది




**తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్**

(ఆంధ్రప్రదేశ్) వారి ప్రచురణ

**శ్రీశ్రీ మహాప్రస్థానం**

హిందీ అనువాదం: నిర్మలానంద వాత్స్యాయన్

వెల: వంద రూపాయలు

ప్రతులకు :

మైత్రి బుక్ హౌస్,
జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-520 002, ఫోన్ : 9848631604


# పత్తిపాటి వెంకటేశ్వర్లుకు జోహార్లు

**'పనిహక్కు'** సంస్థ నాయకుడు, పౌరహక్కుల సంఘ మాజీ నాయకుడు, హైకోర్టు న్యాయవాది పత్తిపాటి వెంకటేశ్వర్లు 11-6-2011న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన తన యుక్తవయస్సునుండీ సామాజిక అభ్యుదయంకోసం, సమానత్వంకోసం, నూతన వ్యవస్థకోసం తపిస్తూ సామాజిక మార్పుకు మార్క్సిజాన్ని ప్రామాణికంగా విశ్వసించారు. అభ్యుదయ భావాలు కలిగిన విద్యార్థి యువకులతో కలసి అనేక ఆందోళనల, ఉద్యమాల నిర్వహణలో పాలుపంచుకున్నారు. హైకోర్టు న్యాయవాదిగా స్థిరపడి, కమ్యూనిస్టు విప్లవకారులపై నిర్బంధం కొనసాగుతున్న కాలంలో అనేక కేసుల విచారణలో వారికి లీగల్ సహాయం, న్యాయవాదిగా సహకారం అందించారు. నాగిరెడ్డి కుట్రకేసు విచారణ సందర్భంగా కీ॥శే॥ యస్.వి.ఎల్., రావి సుబ్బారావులతో కలిసి డిఫెన్స్ న్యాయవాదిగా తోడ్పడ్డారు. తుదిశ్వాస వరకు సామాజిక ప్రగతిని, సామాజిక విప్లవాన్ని ఆకాంక్షించారు. వారి మరణంపట్ల **సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్రకమిటి** తీవ్ర విచారాన్ని వ్యక్తంచేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తున్నది.

# ప్రొఫెసర్ ఆర్.ఎస్.రావుకు జోహార్లు

**ప్రొఫెసర్** ఆర్.ఎస్. రావుగా ప్రసిద్ధులైన రేగులగడ్డ సోమేశ్వరరావు జూన్ నెల 17వ తేదీన ఢిల్లీ నగరంలో తన 74వ ఏట మరణించారు. వారిది విశాఖజిల్లా చోడవరం గ్రామం. వారు పూనా, కోల్‌కతా, నగరాలలో పనిచేసిన తదనంతరం ఒడిషాలోని సంబల్‌పూర్ (బుర్లా) విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ఆచార్యునిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. మనదేశ సాంస్కృతిక సామాజిక వ్యవస్థల విశ్లేషకునిగా మార్క్సిస్టు మేధావిగా ఆయన పేరుపొందారు. భారత సమాజపు అర్ధవలస-అర్ధ ఫ్యూడల్ వ్యవస్థల కలగలపు వ్యక్తీకరణలను సాహిత్య, తారిత్రక, సామాజిక, సంస్కృతులకు అన్వయించటంలో వైవిధ్యపూరిత సృజనను ప్రదర్శించారు. శ్రామిక వర్గ దృక్కోణాన్ని ప్రదర్శించటంలో తనదైన ముద్రను కలిగివున్నారు. ప్రొఫెసర్ ఆర్.ఎస్. రావు మరణానికి 'జనశక్తి' సంతాపాన్ని తెలుపుతోంది.

# వంటగ్యాస్, డీజిల్-పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలి

**కొద్దికాలం** వ్యవధిలోనే మరోసారి వంటగ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరలను కేంద్రప్రభుత్వం పెంచి ప్రజలపై పెనుభారం మోపింది. ఇప్పటికే అందుబాటులో లేని ధరలతో సతమతమౌతున్న సామాన్య ప్రజలకు, పేదలకు భరించసాధ్యం కాని విధంగా ఈ పెంపుదల ఉంది.

వంటగ్యాస్‌పై ఇంతకుముందే 50 రూ. పెంచారు. ఇప్పుడు మరో యాభైరూపాయలు పెంచటంద్వారా సామాన్యులు వంటగ్యాస్‌నుండి వైదొలగే పరిస్థితి ఏర్పడుతున్నది. దీపం పథకంక్రింద గ్యాస్ కనెక్షన్లు పొందిన నిరుపేదలు రూ.400 పెట్టి గ్యాస్‌బండ కొనే ఆర్థిక పరిస్థితిలేదు. దీనితో ఆ కనెక్షన్లు రద్దు అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా ఈ పథకాన్ని ప్రభుత్వం నీరుగార్చ చూస్తున్నది. కిరోసిన్ ధర పెంపు నిరుపేదలకు ఆశనిపాతంలాంటిది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో కిరోసిన్ బుడ్లు, కిరోసిన్ స్టౌవ్‌లు అత్యధికులు వాడుతున్నారు. కిరోసిన్ ధర లీటర్‌కి రెండు రూపాయలు పెంచటంవలన పేదలకు ఇంట్లో వెలుగు కరువయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. డీజిల్ రేట్లు పెరగటంవలన రవాణా ఛార్జీలు పెరిగి నిత్యజీవితావసర వస్తువుల ధరలు మరింతగా పెరుగుతాయి. బస్ ఛార్జీల పెంపుదల భారాన్ని ప్రజలు భరించాల్సి ఉంటుంది. ఈ విధంగా వేలకోట్ల రూపాయల భారాన్ని ప్రభుత్వం ప్రజలపై రుద్దింది.

గ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరలు పెంచటానికి అంతర్జాతీయంగా వాటి ధరలు పెరగటమే కారణమని ప్రభుత్వం సమర్థించుకోచూస్తున్నది. దేశంలోని చమురు, గ్యాస్, నిక్షేపాలను ప్రభుత్వమే వినియోగంలోకి తెస్తే వాటిని దిగుమతి చేసుకోవాల్సిన అవసరమే ఉండదు. బడా పరిశ్రమాధిపతుల, విదేశీ సంస్థల లాభాలకు వాటిని కట్టబెట్టే చర్యలు తీసుకొంటున్నది. ధరలను పెంచి వేలకోట్ల రూపాయల లాభాలను కంపెనీలకు సమకూర్చి పెడుతున్నది. దేశ చమురు అవసరాల్లో 30శాతం దేశంలో ఉత్పత్తి అవుతుండగా 70శాతం దిగుమతిమీద ఆధారపడుతున్నారు. దేశంలో చమురు ఉత్పత్తి ఖర్చులు బ్యారెల్‌కు 12 నుండి 14 డాలర్లు కాగా అంతర్జాతీయ రేటు ప్రకారం రిఫైనరీలు కొనుగోలు చేస్తున్నాయి. ఇంతేకాక పెట్రోలియం ఉత్పత్తులపై వివిధ రకాల పన్నులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయం పెంచుకుంటున్నాయి. పన్నులను తగ్గించుకుని ధరలను పెంచకుండా చేయవచ్చు. కానీ ప్రభుత్వాలు ఈ విధమైన చర్యలు చేపట్టకుండా ప్రజలపై భారాలను పెంచుతున్నాయి.

బడా పరిశ్రమలకు లాభాలను చేకూర్చే విధానాలను విడనాడి వెంటనే పెంచిన డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, అందుకోసం ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిస్తున్నది.

| | | |
|---|---|---|
| **విజయవాడ** | **యస్.ఝాన్సి** | **కె.కోటయ్య** |
| **25-6-11** | **రాష్ట్ర అధ్యక్షులు** | **రాష్ట్ర కార్యదర్శి** |

**నేతి బీర...** (మొదటి పేజీ తరువాయి)

సందేహమా? గాంధీ కనుగొన్న అహింసా అస్త్రమంటూ వీరు కీర్తించే నిరాహారదీక్షపట్లా, అది చేపట్టిన పౌర సమాజానికి చూపెట్టామన్న గౌరవంలో వందో వంతు గౌరవం నిరసనతెలిపే ప్రజల హక్కుపట్ల వారికుంటే, తమ జీవనాన్నీ జీవనాధారాన్నీ నాశనం చేస్తున్న భూసేకరణను ఆపండంటూ కోరుతున్న రైతులపై తుపాకీ కాల్పులతో విరుచుకుపడరు. తమకు యూనియన్ పెట్టుకునేందుకు చట్టబద్ధమైన హక్కుందన్న అంశాన్ని గుర్తించమని అడిగిన కార్మిక మహిళలను లాఠీలతో చావబాదరు. ప్రజలకున్న హక్కులను కాపాడి అమలుచెయ్యమన్న పౌరహక్కుల నాయకుడిని రాజద్రోహం చేశాడంటూ జైల్లోకుక్కరు. పంచాయితీలకు అధికారాలూ, నిధులూ బదలాయిస్తూ రాజ్యాంగ చట్టాన్ని సవరించి దశాబ్దం దాటిపోయినా వాటినమలుచేసే సంగతలావుంచి, పంచాయితీరాజ్‌కు సకాలంలో ఎన్నికలు జరిపించకుండా వుండరు. గతాన్ని వదిలినా, గత పదేళ్ళనుండీ అన్ని రాజకీయ పార్టీలకు చెందిన చట్టసభలకు ఆ ప్రాంతంనుండి ఎన్నికయిన సభ్యులందరూ తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రం చెయ్యమని అడుగుతున్నా ఆరనిచిచ్చులా సమస్యను నాన్చరు. శాంతిభద్రతల వంకచెప్పి తెలంగాణాలో పారామిలటరీ బలగాలు దింపరు. ఆర్థిక భారం సాకుచెప్పి కోస్తాంధ్ర తీరప్రాంత పోలీసుస్టేషన్లు, రహదారుల పోలిసింగు కేంద్ర పారామిలటరీ బలగాలకప్ప చెప్పాలంటూ కేబినెట్ తీర్మానాలూ చేయించి, రాష్ట్రాలను కూడా పంచాయితీల స్థాయికి తగ్గించే విధంగా రాష్ట్రాల అధికారాలను కుదించేందుకు పూనుకోరు.

దోపిడీ పాలకవర్గాల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు రక్షించేందుకు ప్రజలనూ, వారి ఆకాంక్షలనూ, న్యాయమైన హక్కులనూ అణచివేయటమే లక్ష్యంగాగల భారత పాలకులకు ప్రజాస్వామ్య విలువలంటే గౌరవంలేదు. వారు కాపాడుతున్న ఈ సామాజిక వ్యవస్థలో ప్రజాస్వామ్యమూ లేదు. అది దోపిడీ వర్గాల నిరంకుశ పాలనావ్యవస్థ. ఇక్కడ ప్రజాస్వామ్యం నేతిబీరకాయ చందమే!. ✤

# నేడు దేశంలోని కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాళ్ళను ప్రతిఫలిస్తున్న మారుతీ కార్మికుల సమ్మె

**ప్రభుత్వ** వాటాలను కూడా హస్తగతం చేసుకొని, మారుతీ కంపెనీ యొక్క పూర్తి యాజమాన్యాన్ని చేపట్టిన జపాన్‌కు చెందిన మోటారు వాహనాల ఉత్పత్తి సంస్థ సుజికీ కార్పొరేషన్ భారతదేశంలో తిష్టవేసి, అటు ప్రభుత్వం సమకూర్చిన రాయితీలను దండుకొంటూ, ఇటు కార్మికుల శ్రమశక్తిని దోచుకుంటూ దేశంలోని ఆటో రంగ ఉత్పత్తి పరిశ్రమలో బలమైన స్థానాన్ని స్థాపించుకొంది. ఏటా గణనీయమైన మొత్తాలలో సూపర్‌లాభాలను ఆర్జించుకొంటున్నది.

ఈ కంపెనీ ఆర్జించుకొనే సూపర్ లాభాలన్నీ, యిందులో పనిచేస్తున్న కార్మికుల ఉత్పాదకత, శ్రమలపై ఆధారపడి సంపాదింపబడుతున్నదనేది నిర్వివాదాంశం. అందునా ఈ కంపెనీలో పనిచేసే కార్మికులలో ప్రధాన భాగం కార్మికులు కాంట్రాక్టు కార్మికులుగానే పని చేస్తున్నారు. ఇంచుమించుగా కార్మికుల యొక్క పనిని పర్యవేక్షించే కార్మికులతో పనిచేయించుకొనే కొద్దిమంది సూపర్‌వైజర్లు, అధికారులూ, ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగులూ, టీమ్ లీడర్లు, కొద్ది మంది నైపుణ్యంవున్న సీనియర్ కార్మికులూ (వీరు మొత్తంమీద 20%లోపే)తప్ప మిగిలి అందరూ కాంట్రాక్టు కార్మికులుగానే పని చేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులుగా వుండటం వలన వీరికి, శాశ్వత ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలూ, యితర సదుపాయలూ చెల్లింపబడటల్లేదు. కానీ వీరు (ఈ కాంట్రాక్టు కార్మికులందరూ) శాశ్వతంగా నియమింపబడ్డ కార్మికులతో సరిసమానంగా పని చేయాలి. ఉత్పాదక పెంపుదల పేరిట యాజమాన్యం ఎప్పటికప్పుడు పెంచే పనిభారాన్ని శాశ్వత ఉద్యోగులతో సహా ఈ కాంట్రాక్టు ఉద్యోగులూ భరించాలి. ఆ రకంగా మారుతీ యాజమాన్యం ఏకపక్షంగా జరిపే శ్రమదోపిడీని కార్మికులు మవునంగా ఎటువంటి నిరసన తెలపకుండా అంగీకరించి అమలు జరపాలి. మారుతీ యాజమాన్యం యొక్క కార్మిక విధానం అదే.

కార్మిక సంబంధాలను, కార్మికుల పని పరిస్థితులనూ నియంత్రించే చట్టాలున్నా, విదేశీ కంపెనీ యజమాన్యాలు వాటిని అమలు జరపటానికి ససేమిరా అంగీకరించట్లేదు.

విదేశీ పెట్టుబడుల వల్ల దేశంలోని పారిశ్రామిక రంగం, ఉత్పత్తిరంగం దేశం యొక్క ఆర్థిక రంగాలు అభివృద్ధి చెందుతాయన్న సామ్రాజ్యవాద సరళీకరణ ఆర్థిక విధానాలను అమలు జరుపుతున్న పాలకులు, దేశంలో విదేశీ పెట్టుబడిదారీ యాజమాన్యాలు కోరుతున్న గొంతెమ్మ కోర్కెలను అంగీకరిస్తూ, పారిశ్రామిక రంగంలో పెట్టుబడితో సమానంగా భాగస్వాములైన కార్మికులకు కనీసపు అవసరాలను, ప్రయోజనాలనూ పట్టించు కోకుండా, విదేశీ పెట్టుబడిదారీ పరిశ్రమాధిపతులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించి, పారిశ్రామిక ప్రాంతాలను ఏర్పాటు చేయిస్తున్నారు.

అలా ప్రభుత్వ మద్దతుతో ఏర్పాటు చేయబడినదే హర్యానాలోని గురుగావ్–మనేసార్–బావల్ జోన్‌లో ఏర్పాటు చేయబడ్డ పారిశ్రామిక ప్రాంతం. ఈ ప్రాంతంలో భారత్‌దేశంలోని ఆటోరంగంలో జరిగే ఉత్పత్తిలో 60% ఉత్పత్తిని జరుపుతున్న విదేశీ–స్వదేశీ ఆటో ఉత్పత్తి కంపెనీలున్నాయి. ఈ ప్రాంత మొత్తంలో పనిచేస్తున్న 10 లక్షల మంది ఆటోరంగ పారిశ్రామిక కార్మికుల్లో 85% మంది కార్మికులు, కాంట్రాక్టు కార్మికులుగానే పనిచేస్తున్నారు. ఈ పారిశ్రామిక ప్రాంతంలో మారుతీ కంపెనీకి గురుగావ్‌లోనూ, మానేసార్‌లోనూ ఉత్పత్తి ప్లాంట్లున్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతంలోనే కార్మికులను అమానుషంగా, నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేసుకోవటంలోనూ, పీడించటంలోనూ పేరుపడ్డ హీరోహోండా మోటారు సైకిలు ఉత్పత్తి ప్లాంట్లు, రికో కంపెనీ ఉత్పత్తి ప్లాంట్లూ వున్నాయి. ఈ ప్రాంతంలో ఈ కంపెనీలన్నీ, కార్మిక చట్టాలను ఉల్లంఘించటంలో, అమలు జరపటానికి నిరాకరించటంలో ముందున్నాయి. అంతేగాక కార్మికుల నియామక కాంట్రాక్టు ఒప్పందాలను (వేతన పెంపుదలను) పునరుద్ధరించక కార్మికులను అణచి పెట్టటం అన్నది ఇక్కడి కంపెనీల్లో సర్వసాధారణమయిన విషయం.

ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు ఒక సంఘంగా ఏర్పడి, అందులో సంఘటిత పడితే తప్ప తమ హక్కులను సాధించుకోలేరు. తమ సమస్యలను పరిష్కరించుకోలేరు.

కానీ కార్మికులు ఒక సంఘంగా సంఘటిత పడటాన్ని విదేశీ బడా పరిశ్రమాధిపతులు అంగీకరించట్లేదు. 1930వ దశకం నాటికే భారత దేశ కార్మికవర్గం సంఘటితపడి యూనియన్ పెట్టుకొనే హక్కును చట్టబద్ధంగానూ, 1951లో దేశంలో ఏర్పడిన రాజ్యాంగ ప్రకారం రాజ్యాంగబద్ధంగానూ సాధించుకొన్నా నేడు కార్మికులకుగల ఆ హక్కును నిరాకరిస్తున్నారు. ఆ రకంగా దేశంలోని చట్టాన్నీ, దేశసార్వభౌమత్వాన్నీ కూడా ఖాతరు చేయట్లేదు. ఈ నేపథ్యంలో జరిగినదే మారుతీ కంపెనీలోని కార్మికుల సమ్మె.

మనేసార్‌లో గల మారుతీ కంపెనీ ప్లాంటులో 2,000 మంది కార్మికులూ, 500 మంది సూపర్‌వైజర్లు ఆపై సిబ్బందీ పనిచేస్తున్నారు. కార్మికుల్లో 800 మంది వరకూ కాంట్రాక్టు కార్మికులే. కార్మికులు తమ సమస్యలను యాజమాన్యం ముందుంచి. తమతరుపున బేరసారాలాడి తమ సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా వారికి ఒక యూనియన్‌లేదు. గురుగావ్ ప్లాంటులో వున్న యూనియన్ ద్వారానే మనేసార్ ప్లాంటులోని కార్మికులు తమ సమస్యలను పరిష్కరించు కోవలసివస్తోంది. ఇది అసౌకర్యంగా వుండటమేకాక, గురుగావ్‌లో వున్న యూనియన్ నాయకత్వం అక్కడి కార్మికుల ప్రాబల్యంలోనే వుండటం వలన మనేసార్ కార్మికుల సమస్యలకు తగిన ప్రాధాన్యత లభించక పోవటంతో యిక్కడి కార్మికుల సమస్యలు, యిక్కడి కార్మికుల ఆకాంక్షల, అవసరాలకనుగుణంగా సమస్యలు పరిష్కరించబడే అవకాశాలు తగ్గిపోయాయి.

ఇటువంటి పరిస్థితుల్లో యిక్కడి కార్మికులు 'సంఘం' (యూనియన్) ఏర్పాటు చేసుకొనే ప్రక్రియను ప్రారంభించారు. చట్టప్రకారం, రాజ్యాంగ ప్రకారం తమకుగల హక్కును వినియోగించుకొనే ప్రయత్నంలో భాగంగా, చట్టం నిర్దేశించిన మేరకు తమ యూనియన్‌ను నమోదు చేసుకొనే యత్నం ప్రారంభించారు. రాష్ట్ర కార్మికశాఖలో తత్సంబంధిత అధికారికి ధరఖాస్తు చేసుకొన్నారు. ఈ దరఖాస్తులో తమ యూనియన్‌కు నాయకులుగా వ్యవహరించాలని కార్మికులు నిర్ణయం చేసిన 11 మంది మనేసార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికుల పేర్లను పేర్కొన్నారు. (చట్టప్రకారం ఆ వివరం ధరఖాస్తులో పొందుపరచాలి) ఆ కార్మికులు ఆ ప్లాంటులో పని చేస్తున్నారో, లేదో సరిచూసుకొని కార్మికశాఖ యూనియన్ రిజిస్ట్రేషన్‌ను మంజూరు చేయాలి. కార్మికశాఖ ఈ 11 మంది జాబితానూ మారుతీ యాజమాన్యానికి పంపింది. అంతే, వెంటనే మారుతీ యాజమాన్యం తన విశ్వరూపాన్ని చూపిస్తూ ముందుకొచ్చింది. అంకురస్థాయిలోనే ఏర్పడబోయే యూనియన్‌ను బలవంతంగా చిదిమి వేయబూనుకొంది. ఇందుకు చట్టవిరుద్ధ కార్యక్రమాలను చేబట్టడానికి కూడా వెనుకాడలేదు. ఆ ప్లాంటులో వున్న కార్మికులందరినుండీ నిర్బంధంగా తాము "మనేసార్ ప్లాంటులో పెడుతున్న, యూనియన్లో సభ్యులుగా చేరబోమనీ" గురుగావ్ ప్లాంటులో గల యూనియన్లోనే సభ్యులుగా వుంటామనీ ఒక వ్రాతపూర్వక హామీపత్రాన్ని తీసుకొంది. యాజమాన్యం చేసిన ఈ బలవంతపు, చట్ట వ్యతిరేకచర్య సహజంగానే కార్మికుల ఆగ్రహానికి గురయింది.

ఫలితంగా కార్మికులు వెంటనే జూన్ 4వ తేదీ నుండి ఆకస్మిక సమ్మెకు దిగాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. వారు తమ యూనియన్‌ను యాజమాన్యం అంగీకరించి, గుర్తించాలనీ మనేసార్ ప్లాంటులో వున్న కాంట్రాక్టు కార్మికులను అక్కడే ప్రారంభింపబోయే క్రొత్త ఉత్పాదక యూనిట్లలోకి సర్ది, రెగ్యులరైజ్ చెయ్యాలనీ డిమాండ్లు పెట్టారు. ఈ రెండు డిమాండ్లూ పూర్తిగా సమంజసమైనవీ, న్యాయబద్ధమైనవీకూడా. కానీ యాజమాన్యం వెంటనే గగ్గోలు ప్రారంభించింది. చట్టబద్ధత గురించి వాదించటం ప్రారంభించింది. కార్మికులు తమకు సమ్మె నోటీసు యివ్వలేదు కనుక సమ్మె చట్ట విరుద్ధమయినదనే వాదనను ముందుకు తీసుకొచ్చింది. కార్మికుల నుండి తాను చట్టవిరుద్ధంగా, హామీ పత్రాలను, వారి యిష్టానికి వ్యతిరేకంగా తీసుకొన్న విషయాన్ని మాత్రం మరుగుపరిచింది. అంతేకాక తాను ఎంతో మంచి యాజమాన్యాన్ననీ, యితరకంపెనీల్లో కన్నా తన కంపెనీలో కాంట్రాక్టు కార్మికులకు అధికాధికంగా వేతనాలిస్తున్నానీ, కంపెనీలో యిప్పటికీ ఒక యూనియన్ వుండగా, మరో యూనియన్ అవుసరమేమిటనీ కల్లబొల్లి ఏడుపులు ఏడుస్తూ ప్రచారం సాగించింది. సమ్మె చేసిన ప్రతిరోజుకు ఎనిమిది రోజుల వేతనం చొప్పున తనకున్న చటబద్ధ అధికారం ప్రకారం సమ్మెజేసిన కార్మికుల జీతాలలో కోత పెడ్తానని భయపెట్టింది. యూనియన్ నాయకులుగా ధరఖాస్తులో పేర్కొనబడిన 11 మందిని ఉద్యోగాల నుండి తొలగించింది. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ కార్మికుల డిమాండ్లను అంగీకరించేదిలేదని తెగేసి చెప్పింది. కానీ కార్మికులు యిందుకు జడవక, ఐక్యంగా, ధైర్యంగా తమ సమ్మెను సాగిస్తూ వుండటంతో యాజమాన్యం యుక్తి వాదానికి దిగింది. అసలు రిజిష్టరే కాని యునియన్‌తో డిమాండ్ల గురించి చర్చలేమిటి? పొమ్మంది. కంపెనీలో ఒక బలమైన, సమర్ధవంతమయిన యూనియన్ (గురుగావ్‌లోది) వుండగా, మరో యూనియన్ ఏర్పాటు చేయటం వలన కార్మికుల్లో చీలికలు ఏర్పడి, కార్మికోద్యమం బలహీనంకాదా? అంటూ మొసలి కన్నీళ్ళు పెట్టింది. కార్మికుల శ్రేయోభిలాషిగా నాటకాన్ని ఆడింది. కావాలంటే మానేసార్ ప్లాంటు కార్మికుల సమస్యల పరిష్కారంకోసం గురుగావ్ యూనియన్ నాయకత్వంతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయిస్తానని ప్రలోభ పెట్ట చూసింది. అయినా కార్మికులు తమ సమ్మెను విరమించక ముందుకు సాగారు.

మారుతీ యజమాన్యం అనుసరిస్తున్న ఈ దుర్మార్గమైన, కుట్రపూరితమయిన విధానాలు ఆ ప్రాంతంలో వున్న యితరప్లాంట్ల కార్మికుల కోపానికి కారకమయ్యాయి. వారు న్యాయమైన సమస్యల కోసం పోరాడుతున్న మానేసార్ మారుతీ ప్లాంట్ కార్మికుల సమ్మెకు తమ మద్దతు తెల్పారు. ఆచరణాత్మకంగా వివిధ నిరసన ధర్నాలు, సమావేశాలు, ఊరేగింపుల ద్వారా తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

మరోవైపు ఈ సమ్మె ఫలితంగా. దాని ప్రభావం ఆ ప్రాంతపు యితర కంపెనీల ఉత్పత్తిపై వ్యతిరేక ప్రభావం పడింది. మారుతీలో సమ్మెవలన, ఆ కంపెనీకి విడిభాగాలు సరఫరా చేసే యూనిట్ల డిమాండు ఆగి పోవటంతో, వారివద్ద ఉత్పత్తి అయిన సరుకు పేరుకుపోయి వారు ఉత్పత్తులను స్టోరు చేసుకొనేందుకు కూడా స్థలం లేక పోవటంతో ఉత్పత్తులను ఆపి వేయాల్సిన తప్పనిసరి పరిస్థితికి నెట్టబడి, ఆ సమ్మెలో జోక్యం చేసుకుని సమ్మెను విరమింప చేయాల్సిందిగా హర్యానా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

ఇంత జరుగుతున్నా హర్యానా ప్రభుత్వం పట్టించుకోక యిదేదో కార్మికుల సమస్య అన్నట్లుగా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చొంది. తీరా యితర పారిశ్రామిక వేత్తల వత్తిడితో కలుగ చేసుకొన్నా, సమస్యకు మూల కారణమైన అసలు విషయాన్ని పట్టించుకోకుండా, మారుతీ యాజమాన్యాన్నే సమర్ధించే వైఖరి చేపట్టింది. కార్మికుల యూనియన్ రిజిస్ట్రేషన్ సమస్యను పెద్ద మనుష్యుల 'మధ్యవర్తిత్వానికీ' లేబరు కోర్టుకూ నివేదించి వారు చెప్పిన పరిష్కారం ప్రకారం నడుచుకోమని కార్మికులను ఆజ్ఞాపించి కార్మికుల సమ్మెను 'చట్టవిరుద్ధ సమ్మె'గా ప్రకటించింది. సమ్మెపై నిషేధాన్ని విధించింది.

మరోవైపు కార్మికులు యూనియన్ పెట్టుకొంటే బయటివారు నాయకత్వంలోకి వస్తారనీ, యూనియన్ రాజకీయ పార్టీ అనుబంధ సంస్థగా మారిపోతుందనీ, ఇది తాము సహించలేమనీ యాజమాన్యం ప్రచారం మొదలుపెట్టింది.

వాస్తవానికి మానేసార్ ప్లాంటు కార్మికులు ఏర్పాటు చేసుకొన్న యూనియన్ నాయకులలో బయట వారెవ్వరూ లేరు. అందరూ ప్లాంటులో కార్మికులే! పైపెచ్చు వారు తమ యూనియన్‌ను ఏ సంస్థకు గానీ, రాజకీయ పార్టీకి గానీ అనుబంధం చేయాలనే నిర్ణయం యిప్పటివరకూ చేయలేదు. అయినా యాజమాన్యం యిటువంటి వాదనను ముందుకు తీసుకువచ్చింది.

అయితే చట్టప్రకారం యూనియన్ నాయకత్వంలో బయటివారు వుండరాదనికానీ, వారు ఏ సంస్థకూ, రాజకీయ పార్టీకీ తమ యూనియన్‌ను అనుబంధం చేసుకోరాదనిగానీ, ఎటువంటి ఆంక్షకానీ, నిషేధంకానీ లేదు. ఇంతవరకూ ఏ న్యాయస్థానమూ అలా అనుబంధం వుండటం, నాయకత్వంలో యితరులు వుండటం చట్టవిరుద్ధమని ఈ 62 ఏళ్ళకాలంగానూ తీర్పు చెప్పలేదు. చట్టప్రకారం యూనియన్ నాయకత్వంలో 1/3 వంతు మంది యితరులు వుండవచ్చు.

తనకు చెందిన వివాదాలలో తన తరపున వాదించు కోవటానికి, యితరులైన వకీళ్ళనూ, నిపుణులనూ, తన పనులు చేయటానికి యితరులైన లైసన్ ఆఫీసర్లనూ వినియోగించుకొనే యజమాన్యాలు, కార్మికులు తమ తరపున నాయకత్వం వహించటానికి బయటి వారిని ఎంచుకోవద్దని చెప్పటం కన్నా మోసం, అన్యాయం ఏముంటుంది? హర్యానా ప్రభుత్వం, కార్మిక శాఖాధికారులూ ఈ విషయంలోని అసమంజసతనూ, అక్రమతత్వాన్నీ యాజమాన్యానికి అర్థమయ్యేట్టు చెప్పటానికి బదులు, యాజమాన్యానికే తమ మద్దతును (పరోక్షంగా) తెలపటాన్ని బట్టి చూస్తే ప్రభుత్వం కార్మికులకు ఎంతటి వ్యతిరేకంగా వుందో అర్థమవుతుంది.

సమ్మెను చట్టవిరుద్ధమని ప్రకటించటం. సమ్మెపై నిషేధం ప్రకటించటం, యాజమాన్యపు చట్టవిరుద్ధపు చర్యలను ప్రభుత్వం సమర్థించుకోవటం అన్నవిషయం ఆ ప్రాంతపు కార్మికులకు ప్రభుత్వ, యజమాన్యాల అక్రమ విధానాలపట్ల ఆగ్రహం తెప్పించింది. దాంతోవారు మారుతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా జూన్ 14వ తేదీన 2 గంటల పాటు టూల్‌డౌన్ సమ్మె జరిపారు. ఈ సంఘీభావ సమ్మెలో 65 కంపెనీలకు చెందిన 50 వేల మంది కార్మికులు పాల్గొన్నారు.

దాంతో కార్మికుల పోరాటం ఆ ప్రాంతమంతా కార్చిచ్చుగా వ్యాపించబోయే ప్రమాదాన్ని పసిగట్టిన హర్యానా ప్రభుత్వం తిరిగి చర్చల పేరుతో సమస్యను త్రుంచి వేసే యత్నానికి పూనుకొంది. వివాదం పరిష్కరింపబడినా, సమ్మె సందర్భంగా ఉద్యోగాల నుండి తొలగించిన 11 మందిని తిరిగి పనిలోకి తీసుకొనేది లేదనే మొండి వాదనతో యాజమాన్యం మోకాలడ్డింది.

దాంతో కార్మికుల ప్రధాన సమస్య ప్రక్కదారి పట్టి కేవలం ఆ 11 మందినీ తిరిగి పనిలో పెట్టుకోవటం, సమ్మె చేసిన కార్మికులపై కక్షసాధింపులు జరపకపోవటం అన్నదే ప్రధానసమస్య అయికూర్చొంది. ఆ రకంగా కార్మికుల ప్రధాన కీలక డిమాండు అయిన యూనియన్ ఏర్పాటు–గుర్తింపు అన్నది ద్వితీయ స్థానంలోకి నెట్టబడింది. అనుభవరాహిత్యమూ, ఆర్థికవాద కేంద్ర కార్మిక సంఘపు నేతృత్వంలో ఈ సమ్మె సాగుతూ వుండటం వలన అసలు సమస్యలు ప్రక్కదారి పట్టి, కేవలం పని నుండి తొలగింపబడ్డవారి డిమాండే అసలు డిమాండయిపోయింది.

మరోవైపు ఉమ్మతో అతికించి, ఆ వివాదాన్ని పరిష్కరించాలన్న హర్యానా ప్రభుత్వం, దాని అధిపతి అయిన ముఖ్యమంత్రి తాను ఏదోఒకటి చేసి రెండవ యూనియన్ రిజిష్టరు కాకుండా చూస్తానని మారుతీ–సుజుకీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరయిన షింజోన కాన్షీకి, హామీ యిచ్చి, మారుతీ యాజమాన్యం చేత ఆ పనినుండి తొలగింపబడిన 11 మందినీ తిరిగి పనిలోకి తీసుకొనేట్టు ఒప్పింపచేసి, ఇటు కార్మికులను( వారి నాయకత్వాన్నీ) ఒప్పించి కార్మికుల చేత సమ్మె విరమింప చేశాడు. 13 రోజులుగా సాగిన ఈ సమ్మె ఈ రకంగా విరమింప చేయబడింది.

ఈ సందర్భంగా చేసుకొన్న ఒప్పందంలో ఈ క్రొత్త యూనియన్ రిజిస్ట్రేషన్ ప్రసక్తిలేదు. ఇలా ఎందుకు జరిగిందంటే, ఈ సమ్మెకు నాయకత్వం వహించిన ఎ.ఐ.టి.యు.సి. కేంద్రనాయకులు, తాము యూనియన్ పెట్టుకోవాలంటే యజమాన్యపు పర్మిషన్ అవుసరం లేదనీ, అందువలన ఆ ప్రస్తావన ఒప్పందంలో లేదనీ అంటున్నారు. ఒకవేళ తమ యూనియన్‌ను రిజిష్టరు చేసుకోకపోతే హైకోర్టు కెళ్ళి పోరాడతామంటున్నారు.

అటువంటప్పుడు ప్రస్తుతపు సమ్మెను ఏకారణంచేత చేబట్టాల్సి వచ్చిందన్నది వారి నుంచి జవాబురాని ప్రశ్నగానే మిగిలిపోయింది.

బహుశా ఈ మేరకు అల్లరి చేసి, హర్యానా ప్రభుత్వంతో చర్చలు జరిపేస్థాయికి తాము గుర్తింపబడి నందుకు ఆ నాయకత్వం సంతృప్తిచెందివుండొచ్చు!

లేదా, యింతకుమించి పోరాటాన్ని తీవ్రతరం చేయటం వలన కలిగే చిక్కులు, అనర్థాలను తట్టుకోలేక పోయిన, తట్టుకోవాల్సిన అవసరం లేదనుకొన్నందువల్ల వారు సమ్మె విరమణకు సంతృప్తిపడి వుండవచ్చు!!

లేదా, యింతకు మించి మిలిటెంటు రూపం తీసుకొంటే కార్మికవర్గం తమ అదుపును మించి ముందుకు సాగిపోతుందనే భయంతో వారు సమ్మెను విరమింపచేయించివుండవచ్చు!!!

ఇవీ ఈ దేశంలోని కార్మికులకున్న పరిమిత పరిస్థితులు. అయితే ఈ పరిస్థితులను కార్మికుల కనుకూలంగా తేలిగ్గా మలచవచ్చునని పెట్టుబడిదారీ విధాన ప్రబోధకులు వాదిస్తున్నారు. అంటే తమకు వద్దనుకొన్నప్పుడు కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించే (లేఆఫ్ చేసే) విధంగా కార్మిక చట్టాలను సంస్కరిస్తే కాంట్రాక్టు కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమంగా జీతభత్యాలు యివ్వటం కష్టంకాదన్నది వారి వాదన. నిజంగా పరిమిత నియంత్రణా చట్టాలున్నప్పుడే వాటిని అంగీకరించని బడా పెట్టుబడిదార్లు పెద్దపులి పేరంటం పెడ్తారట! మనల్ని నమ్మమంటారు ఈ వివేకులు.

ఇంతజరిగినా, మారుతీ మానేసార్ కార్మికులు తమ యూనియన్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనే దృఢనిశ్చయంతో వుండటం ఆశావహమైన విషయం.

దేశంలోని కార్మికులు ఎదుర్కొంటున్న ఈ ప్రధాన సవాళ్ళను అధిగమించాలంటే, వారు తమ పురోగతికి గుదిబండలుగా మారిన ఈ పరిమితులను ఛేదించుకొని మరింత చైతన్యంతో, వర్గ రాజకీయ అవగాహనతో ముందుకు సాగాల్సివుంటుందనేది ఈ మారుతీ కార్మికుల సమ్మె నేర్పుతున్న గుణపాఠం! కార్మికులు తమ వర్గరాజకీయాలను సాగించక తప్పదన్నదే దాని సారాంశం!!. ✤

## అనైతిక ఔషధ ప్రయోగాలు

# భారతదేశంలో అమలవుతున్న సామ్రాజ్యవాద నయా ఉదారవాద దుష్ట విధానాల దృష్టాంతాలు

**గత** రెండు వారాలుగా మన రాష్ట్రంలో సాగుతున్న హేయమైన, నీతిబాహ్యమైన ఔషధ ప్రయోగ బాధితుల విషాదకర, హృదయవిదారక, ఒడలు జలదరించే కథనాలు ప్రచారమాధ్యమాలలో పెద్దఎత్తున పోటెత్తుతున్నాయి. రాజ్యాంగపరంగా గానీ మరేవిధమైన రక్షణలేని మన దేశంలోని సాధారణ ప్రజానీకంయొక్క జీవించే హక్కుపై ఉద్దేశ్యపూరితంగా దాడి జరుగుతున్న పెను విపత్తును గురించి ఈ పరిణామాలు హెచ్చరిస్తున్నాయి.

### ఔషధ ప్రయోగ జంతువులుగా పేదలు

కలవరానికి గురిచేసే ఆ వార్తా కథనాలలోని సారాంశమేమంటే – ఔషధ పరిశోధనా సంస్థలు (సిఆర్ఓలు) బడాబహుళజాతి మందుల పరిశ్రమల పనుపున మనుష్యులపై ఔషధ ప్రయోగాలను సాగిస్తున్నాయి. నిరక్షరాస్యులను, ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురయ్యే దళితులను, గిరిజనులను ఈ ప్రయోగాల నిర్వహణకు ఉపయోగించు కుంటూ ఈ సంస్థలు నీతిసూత్రాలనే వాటిని తుంగలో తొక్కేస్తున్నాయి. వీరిపై విచక్షణారహిత ఔషధ ప్రయోగాల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా బలహీనమైన ఈ ప్రజల జీవించే హక్కును దారుణంగా కాలరాచివేస్తూ మానవత్వాన్నే మంటగలుపుతూ, త్వరితంగా లాభాలార్జించేందుకు ప్రమాదకరమైన అనైతిక ఔషధ ప్రయోగాలకు వీరిని గినీ పిగ్స్‌గా (ఔషధ ప్రయోగ జంతువులుగా) ఉపయోగించుకుంటున్నాయి. గుంటూరు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన పేద మహిళలు; ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన నిరక్షరాస్యులైన ఆదివాసీలు; వలసవచ్చిన దినకూలీలు, ఒంటరి మహిళలు, భర్తలను కోల్పోయిన నిరుపేద మహిళలు, మైక్రోఫైనాన్స్ సంస్థల బాధితులు; మానసిక ఆసుపత్రుల లోని రోగులు ముఖ్యంగా ఆర్థిక వత్తిడులలోవున్న నిర్భాగ్యులను ఈ ఔషధ ప్రయోగ సంస్థలు లోబరుచుకుని, వారిపై అనైతికంగా ఈ ఔషధ ప్రయోగాలు సాగిస్తున్నాయి. యాక్సిస్ లాబ్, హైదరాబాద్; మైక్రో థెరపిటిక్ రీసెర్చ్ ల్యాబ్స్, చెన్నై; ఆర్.ఆర్.ల్యాబ్స్, చెన్నై; జివికె బయోసైన్సెస్, హైదరాబాద్; ఆక్టిమస్ బయో, విశాఖ–వంటి ఔషధ ప్రయోగ సంస్థలు తమ సూపర్ లాభాల వేటలో కనీసపాటి గుర్తింపుకు నోచుకోని, నిరుపేద, నిర్భాగ్యులైన వారి ప్రాణాలను బలి పెడుతున్నాయి.

ఈ కంపెనీలు తమ దళారులద్వారా ఆర్థిక వత్తిడులకు గురైన దుర్బలురను, నిరుపేదలను, ప్రలోభపరిచి, లోబరుచుకుని గినీపిగ్స్‌గా వారిపై ఔషధ ప్రయోగాలు చేస్తున్నాయి. అసలు వారిపై ప్రమాదకరమైన ఔషధ ప్రయోగాలు జరుపుతున్నారనే విషయాన్నిగానీ తమపై జరిగే ఔషధ ప్రయోగ ఫలితంగా అనేక బాధలు, వైకల్యాలు లేదా ఆఖరుకు మరణమైనా సంభవించ వచ్చుననే వాస్తవాలుకానీ వారికి తెలియజేయటమనేదే జరగటంలేదు. కొద్దిపాటి డబ్బు చేతిలో పెట్టి ఈ నిర్భాగ్యులను సంతృప్తిపరచటమో లేక ఏ విధమైన ఫీజు లేకుండానే వారి జబ్బులకు ఉచిత వైద్యం అందిస్తున్నామనే పేరిటనో, వివిధ రూపాల్లో వారిని మభ్యపరుస్తూ వారిపై సాగిస్తున్న ప్రమాదకర ప్రయోగ స్థితిగురించి తెలియజేయ కుండా దాచి వుంచుతున్నారు. ఈ దళారులలో గ్రామీణ ప్రాంత మధ్యవర్తులేకాక, గౌరవనీయమైన డాక్టరు వంటి వృత్తిలో వుండే ఆశపోతులైన వారు కూడా వున్నారు. ఈ దళారులు దుర్బలురైన ప్రజలను వశపరుచు కొని వారికి ఔషధ ప్రయోగాల గురించిన వాస్తవాలనేమీ చెప్పకుండానే వారిపై ప్రయోగాలు సాగిస్తున్నారు.

### మానసిక రోగులూ ప్రయోగ జంతువులే

మీదుమిక్కిలి ఇదేదో ప్రైవేటు ఆసుపత్రులకు మాత్రమే పరిమితమైలేదు. ప్రభుత్వ ఆసుపత్రులుకూడా వారికున్న అనుకూల పరిస్థితుల నుపయోగించుకుని అనైతిక ఔషధ ప్రయోగాలకు కేంద్రాలుగా రూపొందాయి. డాక్టర్ల ఉదాశీనతను ఆసరాగా చేసుకొని ఒక బడా బహుళజాతి మందుల పరిశ్రమ అవసరాల నిమిత్తం విశాఖపట్నం ప్రభుత్వ మానసిక వైద్యశాలలో 2001 నుండీ ఔషధ ప్రయోగాలు నిర్వహిస్తున్న విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ ఆసుపత్రిలో మన రాష్ట్రంతో పాటు ఒడిషా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలనుండి కూడా మానసిక రోగులు చికిత్స పొందుతుంటారు.

ఈ మానసిక రోగులనుండి సేకరించిన రక్త నమూనాలు, ఇసిజి రిపోర్టులను కొరియర్ విధానంద్వారా అమెరికా, సింగపూర్‌లకు పరిశోధనలకొరకై పంపుతారని వెల్లడైంది. ఈ పరీక్షలు నిర్వహించే వైద్యులు సంవత్సరంలో 20–30సార్లు అమెరికా, సింగపూర్‌లను సందర్శిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఈ ఆసుపత్రిలోని రోగులపై ఔషధ ప్రయోగాలు చేస్తున్నమాట నిజమేనని నిర్ధారించాడు. ఈ ఔషధ ప్రయోగాలను నిర్వహించే సంస్థల గురించికానీ, ఏఏ ఔషధాలను రోగులపై ప్రయోగించారనే విషయంపై గానీ, ఆ మందులు ప్రయోగించిన కారణంగా రోగులలో సంభవించే ప్రతిచర్యలు లేదా సైడ్‌ఎఫెక్ట్స్ గురించికానీ అత్యంత నిర్లక్ష్యంగా వున్నాడు. ఈ మందులు ఏఏ రోగులపై ప్రయోగించారో తెలిదని, ఔషధ ప్రయోగాల అనంతరం వారిలో వచ్చే ప్రతిచర్యలు, సైడ్‌ఎఫెక్ట్స్ ఏవిధంగా ఉన్నాయో కూడా తనకు తెలిదని అమాయకత్వం నటిస్తున్నాడు. ఈ విషయమై ప్రభుత్వం నిర్దిష్ట మార్గదర్శకాలను రూపొందిస్తే వాటిని తాను అమలుచేసే నిమిత్తమాత్రుడనేనని అమాయకంగా ప్రకటిస్తున్నాడు. ఇదీ, ప్రజలపట్ల బాధ్యతగానూ, ప్రజలకు జవాబుదారీగానూ ఉండవలసిన ఒక ప్రభుత్వ అధికారియొక్క సిగ్గుమాలిన బాధ్యతారహిత వైఖరి! నిస్సంకోచంగా ఔషధ ప్రయోగ మాఫియా పక్షంవహించిన వీరు–ప్రజలు నిలదీస్తారనిగానీ, తమ అంతరాత్మపట్లగానీ, ఏ విధమైన జంకూ లేకుండా కనీస మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారు.

### నియంత్రణకు చట్టాలు సరిపోవట!

మన ముందున్న విషయంయొక్క తీవ్రత ఇదికాగా, ఈ ప్రమాదంపట్ల మన ప్రభుత్వ, పాలకుల నిష్క్రియ, ఉదాశీనత, లెక్కలేనితనం, పట్టనితనాలనేవి చాలా లోతైనవేకాక ప్రజాస్వామ్యవ్యవస్థగా చెప్పబడుతూవున్న, దీనిని నడుపుతూవున్న పాలకులయొక్క దుష్ట విధానాలకు దృష్టాంతాలుగా వున్నాయి. మన రాష్ట్ర పాలకులు, ప్రభుత్వ అధికారులు తమకు ఔషధ ప్రయోగాల నిర్వహణపై నియంత్రణాధికారం లేదనీ, కేంద్ర ఔషధ యంత్రాంగము, భారత వైద్య పరిశోధనామండలి మాత్రమే వాటికి అనుమతులు ఇస్తున్నాయని చాలా తేలిగ్గా వాదిస్తున్నారు. అమాయకులైన, నిరక్షరాస్యులైన, సాంఘిక అణచివేతకు గురయ్యే నిరుపేదలపై అనైతిక ఔషధ ప్రయోగాలు నిర్వహిస్తూ, చట్టవిరుద్ధంగా వారిపై ప్రయోగించిన ఔషధాల సైడ్‌ఎఫెక్ట్స్ ఫలితంగా అప్రకటితమైన ఎన్నో ఆరోగ్యపరమైన ఇబ్బందులతో పాటుగా, అనేక వైకల్యాలకు, మరణాలకు గురిచేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకొని వుండేవారమనీ, కానీ అందుకు అవకాశం లేకుండా చట్టం తమను నిరోధిస్తున్నదని నమ్మబలుకుతున్నారు.

స్వార్థపరశక్తులు నిర్వహించే అనైతిక, నేరపూరిత ఔషధ ప్రయోగాలు ఇదే మొదటిసారైతే, ఈ విధమైన క్రూర, అమానవీయ చర్యలను నిరోధించకుండా తీవ్రమైన ఈ సమస్యపట్ల ఉదాసీనంగా వ్యవహరించిన అధికారుల బద్ధకం, నిర్లక్ష్యం, కాలయాపన చేసే లక్షణాలకు తోడు చట్టపరమైన చర్యలు తీసుకొనే అవకాశంలేకపోవటమనే కారణాలను మనం చెప్పుకునే అవకాశం వుండేది.

కానీ, గత నాలుగు సంవత్సరాలుగా అనైతిక ఔషధ ప్రయోగాలకు సంబంధించిన అనేకానేక సంఘటనలు వెలుగులోకి రావటమనేది–సామాజికంగా, ఆర్థికంగా దుర్బలురైనవారు ఈ ఔషధ ప్రయోగాలలో బలిపశు వులవుతున్నారని; వలసకూలీలు, మహిళలు, పిల్లలు, ఆదివాసీలు వంటి అమాయకమైన, నిరక్షరాస్యులైన, పేద ప్రజలు ఈ ప్రయోగాల బారినపడి ప్రాణాలను కోల్పోతున్నారనే వాస్తవాన్ని నొక్కిచెపుతున్నది.

### గిరిజన బాలికలపై ఔషధ ప్రయోగాలు

మరీ ప్రత్యేకంగా అమెరికాకు చెందిన గేట్స్ ఫౌండేషన్ నిధులతో నడిచే 'ప్రోగ్రామ్ ఫర్ అప్రోప్రియేట్ టెక్నాలజి అండ్ హెల్త్' (పాత్) అనే ప్రభుత్వేతర సంస్థ ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలోని గిరిజన బాలికలపై అనైతికంగా, ప్రమాదకరమైన హెచ్.పి.వి.టీకాలను ప్రయోగించటంపై ప్రజలనుండి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ప్రమాదకరమైన టీకా ప్రయోగాలపట్ల ప్రభుత్వం పట్టనితనంతో వ్యవహరించటమేగాక ఏజన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, హాస్టల్ వార్డెన్స్‌కు ఐటిడిఏద్వారా ఒక సర్క్యులర్‌ను పంపింది. అందులో టీకా ప్రయోగాలకు అంగీకరిస్తూ ఆ గిరిజన బాలికలను స్వచ్ఛందంగా పేర్లను నమోదు చేసుకోమని ఆదేశాలు నిచ్చింది. గతంలో ఏ విధమైన ఔషధ ప్రయోగాలలోనూ పరీక్షించబడని, ప్రమాదరహితమైనదిగా నిగ్గుతేల్చబడని హెచ్.పి.వి. టీకాలను అమాయక గిరిజన బాలికలపై ప్రయోగించటంతో వారిలో కొందరు మరణించారు. అనేకులు దాని దుష్ఫలితాలను వివిధ రూపాల్లో అనుభవిస్తున్నారు. హెచ్.పి.వి. టీకాలు ప్రయోగించిన తర్వాత చనిపోయిన గిరిజన బాలికలెవ్వరూ ఈ ఔషధ ప్రయోగ ఫలితంగా మరణించలేదని, ఆత్మహత్యలవంటి కారణాలతో చనిపోయారని సంబంధిత ప్రభుత్వాధికారులు గుడ్డిగా పేర్కొనటం వీరి క్రూరత్వానికి ఒక ఉదాహరణ! ప్రభుత్వమనుసరించిన కరుడుగట్టిన వైఖరికి నిదర్శనమిది! ఏమైనప్పటికీ, ఈ కేసును పరిశోధించటానికి కేంద్రప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ తన తుది నివేదికను 2011 మేలో ప్రకటించింది. ఆ నివేదికలో ఔషధ ప్రయోగాలకు బాధ్యులెవరనే దానిని నిర్ధారించటంలో తప్పించుకుపోయే, అస్పష్టతలట్లా వుంచితే, నిర్భాగ్యులైన గిరిజన బాలికలపై హెచ్.పి.వి. టీకాల ప్రయోగాలనేవి తీవ్ర నైతిక ఉల్లంఘనలుగా ఈ నివేదిక చాలా స్పష్టంగా పేర్కొంది. కానీ, ఈనాటికీ మన రాష్ట్ర ప్రభుత్వమూ, సంబంధిత అధికారులూ అమాయకత్వం నటిస్తున్నారు. తాము కఠినంగా వ్యవహరించలేక పోవటానికి చట్టపరమైన కారణాలే ఆటంకాలన్నట్లుగా సాధ్యమైన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుని ప్రజలను నమ్మించే ప్రయత్నాలతో పాటు ఈ విషయాలపై తాము వ్యవహరించేందుకు వీలుగా ఒక కఠినమైన చట్టాన్ని రూపొందించవలసిన అవసరాన్ని గురించి చర్చిస్తున్నామని ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. దిగువ స్థాయిలో దళారులుగా వ్యవహరించిన ఒకరిద్దరిని అరెస్టుచేయటం ద్వారా దుర్బలురైన, అమాయకులైన ప్రజలను కబళించే అసహ్యకరమైన, అమానవీయమైన ఈ ఔషధ ప్రయోగాల నిర్వహణ పట్ల వారు కూడా చాలా తీవ్రంగా వ్యవహరిస్తున్నట్లుగా ఫోజుపెడుతూ నాటకాలాడు తున్నారు.

### వొళ్ళు జలదరించే ఔషధ ప్రయోగ మరణాలు

రాష్ట్రప్రభుత్వం ఆడుతున్న నాటకమీవిధంగా వుంటే, కేంద్రప్రభుత్వం కూడా అమాయత్వం ఒలకబోస్తూ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయని చెప్పబడుతున్న అనైతిక ఔషధ ప్రయోగాలపై ఇప్పుడు తానొక విచారణను ప్రారంభించానని గంభీరంగా ప్రకటిస్తూ ఈ సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తున్నట్లుగా కనిపించే ప్రయత్నం చేస్తున్నది.

ఏమైనా, మనదేశంలో సాగుతున్న అనైతిక ఔషధ ప్రయోగాల గురించికానీ, ఆ కారణంగా సంభవించే మరణాల గురించికానీ కేంద్రప్రభుత్వం తనకేమీ తెలిదన్నట్లుగా వ్యవహరిస్తున్నది. ఇటీవలి కాలంలో (19–6–11న) ఓ జాతీయ దినపత్రికలోని వార్త ఈ విధంగా పేర్కొంటున్నది: 'గత సంవత్సరం(2010లో) తాము నిర్వహించిన ఔషధ ప్రయోగాలలో మరణించిన వారికి నష్టపరిహారం చెల్లించనున్నామని దేశంలోని అతిపెద్ద మందుల కంపెనీలు ప్రకటించిన రెండువారాల లోపులోనే 25మందికిగానూ 16మందికి నష్టపరిహారం చెల్లించబడింది; మిగిలిన 9 మందికి సంబంధించిన హక్కుదారులను గుర్తించలేని ఫలితంగా వారికి చెందవలసిన నష్టపరిహారం అందించలేకపోయారు'. అదే వార్తలో '2010లో 44 అంతర్జాతీయ మందుల పరిశ్రమలు నిర్వహించిన ఔషధ పరీక్షల్లో 671 మరణాలు సంభవించాయ'ని పేర్కొంది. అదేవిధంగా '2007లో 132 మరణాలు; 2008లో 288 మరణాలు; 2009లో 637 మరణాలు ఈ ఔషధ ప్రయోగాల సందర్భంలో సంభవించి'నట్లుగా అదే వార్తలో పేర్కొన్నారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే భారత భూభాగంపై ఎంతటి ఘోరమైన, దుష్టపథకాలు తిష్టవేసుకొని, అమలవు తున్నాయో గమనంలోకివచ్చి వళ్ళు జలదరిస్తుంది.

అలాగే, ఇటీవల ఓ సంపాదకీయ వ్యాఖ్య(ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్, 20–6–11) ఈ విధంగా పేర్కొన్నది : 'ఢిల్లీ, రాజస్థాన్‌లలోని 134 ఔషధ అమ్మక కేంద్రాలపై డిసిజిఐ (భారత ఔషధ నియంత్రణాధికారి) అధికారులు సాగించిన వరుస దాడులలో 85 అమ్మక కేంద్రాల్లో నిషేధించిన మందుల అమ్మకం జరుగుతున్నదని వెల్లడైంది. అనేక దుష్ఫలితాల నిస్తున్నాయని నిరూపిత మైన కారణంగా వివిధ దేశాలలో నిషేధించిన మందులు అమ్మకాలు ఈనాటికీ భారత దేశంలో సాగుతున్నాయి. ఇతర దేశాలలో అనేక సంవత్సరాల క్రితమే నిషేధించ బడిన మందులు భారత దేశంలో నేటికీ అందుబాటులో వున్నాయి. నవాల్జిన్, బరాల్గాన్ వంటి మందులు బ్రాండెడ్ పేర్లతో మనదేశంలో సం॥నికి 20కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్నాయి. మన దేశంలోని ఔషధ నియంత్రణ నియమాలు అంతర్జాతీయ ప్రమాణాలకు సుదూరంలో వున్నాయనేది స్పష్టమనీ, భారత ప్రజలు ఔషధ కంపెనీల చేతిలో గినీపిగ్స్‌గా ఉపయోగ పడుతున్నారనీ; ఈ ఔషధ కంపెనీలు ఇతర దేశాలలో కొన్ని అనుమానాస్పద ఔషధాలుగా ఏనాడో నిషేధించి నప్పటికీ భారతదేశంలో వాటి అమ్మకాలను ఈనాటికీ సాగిస్తూవున్నాయ'నీ ఆ వార్త తెలియజేసింది.

ఈ వార్త, వ్యాఖ్యల సారాంశాన్ని పరిశీలిస్తే భారత దేశంలో బహుళజాతి, బడా ఔషధ కార్పోరేషన్లు అనైతిక ఔషధ ప్రయోగాలని, అనైతిక మందుల వ్యాపారాలనీ ఏవిధంగా కొనసాగిస్తున్నాయో, మనమెంత లోతైన, భయంకరమైన ప్రమాదాన్నెదుర్కోబోతున్నామో తెలికగా అర్థమౌతుంది. ఏదిఏమైనా ఈ అనైతిక ఔషధ ప్రయోగాలను నిరోధించడం కానీ, వాటిని నిర్వహిస్తున్న బహుళజాతి కంపెనీలపై ఆంక్షలు విధించటం కానీ చేయకుండా మన పాలకులు, ప్రభుత్వాలు వాటిని లోపాయికారీగా తప్పిస్తూ, బుకాయింపులతో సరిపుచ్చుతూ వ్యవహరిస్తున్నాయని మనకు స్పష్టమౌతున్నది.

చట్టబద్ధమైన ప్రభుత్వం, గొప్పరాజ్యాంగం కలిగివున్న 'సార్వభౌమ', 'ప్రజాస్వామిక' దేశంలో ప్రజల జీవించేహక్కు ఇంతటి క్రూరంగా ఎందుకు, ఏవిధంగా అణచివేయబడుతున్నదన్న ప్రశ్న తలెత్తుతోంది.

### సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్ఫలితాలివి

సామ్రాజ్యవాద ప్రభువులు మనపై రుద్దిన నయాఉదారవాద ఆర్థిక విధానాలను అమలుచేసే పవిత్ర కర్తవ్యాన్ని భారత పాలకులు నెత్తికెత్తుకున్నారనే విషయం రహస్యమేమీ కాదు. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుకు పూనుకోవటమంటే, 'స్వేచ్ఛా మార్కెట్టు', 'స్వేచ్ఛా పోటీ'ల పేరిట అన్ని నీతి నియమాలను, మానవ విలువలను ఉల్లంఘిస్తూ తాము సూపర్ లాభాలు గడించేందుకు క్రూరమైన దోపిడీని కొనసాగించడమే! ఈ చేదుమాత్రను మింగించేందుకు 'ఆర్థిక సంస్కరణలు', 'ఆర్థిక అభివృద్ధి' 'ఆర్థిక పెరుగుదల', మొదలైన తీయటి పైపూతలతో, తప్పుడు ఆదర్శాలు, వాగ్దానాలతో ప్రపంచ ప్రజానీకాన్ని భ్రమలకు గురిచేస్తున్నారు. ప్రపంచీకరణ పేరుతో సామ్రాజ్యవాదం, మన పాలకులను కూడా స్వచ్ఛంద భాగస్వాములుగా చేసికొని ఆడుతున్న దౌర్భాగ్యకర క్రీడలివి.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే పేరిట ఆర్థికాభివృద్ధి, పెరుగుదలల పేరిట సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలు అనైతికమైన, క్రూరమైన, ఘోరమైన దోపిడీలు సాగించుకునేందుకు మనదేశ పాలకులు యథేచ్ఛగా అవకాశాలు కల్పించారు. ఈ విధంగా సూపర్ లాభాలు పిండుకోవడానికి తహతహ లాడే అంతర్జాతీయ ఔషధ కంపెనీలకు మనదేశం స్వర్గధామమయ్యింది.

2011 నాటికి భారతదేశంలోని ఔషధ ప్రయోగ పరిశ్రమ ఐదువేల కోట్ల రూపాయల విలువచేసే వ్యాపారాన్ని కొనసాగించవచ్చునని, 'మెకెన్సీ' అనే సామ్రాజ్యవాద కన్సల్టెన్సీ ఏజన్సీ ప్రకటిస్తున్నది. ఈవిధంగా ఈ క్రూరమైన, అనైతికమైన ఔషధ ప్రయోగాలను భారతదేశంలో పెద్దఎత్తున కొనసాగించేందుకు, భారతదేశ అభ్యున్నతికి లేదా అభివృద్ధికి ఇదేమార్గమన్నట్టుగా మన పాలకులను, ప్రభుత్వాన్ని ప్రేరేపిస్తున్నారు.

### 'అమెరికన్ కార్యాచరణ ప్రణాళిక'–కుట్రలు కుతంత్రాలు

అమెరికన్ సామ్రాజ్యవాదంచే నియంత్రించబడే ఐక్యరాజ్యసమితి అంగాలైన ప్రపంచ ఆరోగ్యసంస్థ, యూనిసెఫ్‌లు–అభివృద్ధిచెందని భారత సమాజంలో వారసత్వంగా సంక్రమించే అనారోగ్యాల గురించిన సమాచారాన్ని తమ 'నైపుణ్యం'తో మరింతగా పెంచి చూపించటంద్వారా; భారత ప్రజలు–ముఖ్యంగా బాలల, మహిళల భయానకమైన ఆరోగ్య పరిస్థితుల గురించి ఆందోళనకరమైన నివేదికలను ప్రచురించటంద్వారా భారతదేశంలో ప్రజాభిప్రాయాన్ని తమ చర్యలకు అనుకూలంగా మలుచుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఈ విషయంలో అమెరికన్ సామ్రాజ్యవాద 'కార్యాచరణ ప్రణాళిక' యొక్క కుట్రలు, కుతంత్రాలు

ముఖ్యంగా పేర్కొనదగినవి. మొదటగా ప్రపంచ ఆరోగ్యసంస్థ, యూనిసెఫ్‌ల ద్వారా తామెంచుకున్న నిర్దిష్ట దేశంలో ప్రత్యేక అనారోగ్యాలు, వ్యాధులతో బాధపడే బాలల, మహిళల ఆందోళనకర ఆరోగ్య పరిస్థితుల గురించి నివేదికలను వెలువరించి, వారిని ఉద్ధరించేందుకు కొన్ని కార్యక్రమాలను రూపొందించటంతో ప్రారంభిస్తారు. తరువాత వితరణశీలుర, దాతృత్వ ఫౌండేషన్స్ రూపంలో ఈ జబ్బులపై పరిశోధనలకు సహాయం, నిధుల కేటాయింపులతో ప్రవేశిస్తారు. వీరు ఆయా దేశాల ప్రభుత్వాలతో ఆరోగ్య పరిరక్షణకు చౌకయిన విధానాలను ఆవిష్కరించే పేరిట ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఆ తరువాత ప్రభుత్వేతర సంస్థలు తమ పథకాల నిర్వహణ పేరిట పరిశోధన ముసుగులో బడా ఔషధ పరిశ్రమలకు తోడ్పడేందుకు రంగంలోకి దిగుతాయి. ఈ సంస్థలు అనైతిక, బాధ్యతారహిత పద్ధతుల్లో త్వరితంగానూ, చౌకగానూ ఔషధ ప్రయోగాలు నిర్వహించటంద్వారా అంతిమంగా సంబంధిత ఔషధం గురించి చేయవలసిన ప్రయోగాలను పూర్తిచేసి, త్వరితంగా మార్కెట్‌లో వాటి అమ్మకాలకు ఆమోదం పొంది అత్యధిక లాభాలార్జిస్తాయి. రూపాలు మారవచ్చు కానీ సారాంశం మాత్రం అన్ని సందర్భాల లోనూ ఇదే విధంగా వుంటుంది. భారత వైద్య పరిశోధనా మండలి–ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ప్రభుత్వాలతో మిలిండా గేట్స్ ఫౌండేషన్ చేసుకున్న ఒప్పందంలో భాగంగా 'పాత్'(పిఏటిహెచ్) అనే ప్రభుత్వేతర సంస్థద్వారా ప్రమాదకర హెచ్.పి.వి. వ్యాక్సిన్ ప్రయోగ ఉదంతం కూడా ఈ కోవలోనిదే.

## దాతృత్వం పేరుతో దుర్మార్గం

ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్‌లు భారత దేశంలో వివిధ రకాల వ్యాధులతో బాధపడే బాలల విషాదకర ఆరోగ్య పరిస్థితులపై పెద్దఎత్తున ప్రచారం చేపట్టి టీకాల ద్వారా వాటిని నిరోధించవచ్చుననే ప్రచారం మొదట ప్రారంభించాయి. ఆ తరువాత గేట్స్ ఫౌండేషన్ మరియు మిలిండా గేట్స్ ఫౌండేషన్ సంస్థలు ప్రపంచ దేశాలలో ఎయిడ్స్, మలేరియా, తదితర వ్యాధుల నివారణకు అవసరమైన టీకాల కొరత గురించి, ప్రపంచ వ్యాపితంగా అతిపెద్ద సమస్యఅయిన ఆరోగ్య విషయంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించటం గురించి తీవ్రస్థాయిలో బాధపడిపోయాయి. ఆపై ఆ టీకాలకోసం, టీకాల పరిశోధనలకోసం నిధులను కేటాయించాయి. లక్షడాలర్ల అతితక్కువ నిధులతోనే అభివృద్ధి చెందుతున్న దేశాలలో శాస్త్రవేత్తలు చాలా ప్రయోగాలు చేయగలుగు తారని ఆ సంస్థలు గుర్తించాయి. కనుక ప్రపంచ దేశాలలో రోగనిరోధక శక్తిని పెంచటానికుద్దేశించిన 'గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ ఇమ్యునైజేషన్' (GAVI) సంస్థకు అధిక నిధులు కేటాయించారు.

అలాగే ఈ సంస్థలు ఔషధ, జీవసాంకేతిక పరిశ్రమలను ప్రారంభించి, 'అభివృద్ధిచెందుతున్న ప్రపంచానికి' కొత్త టీకాలను–ఈ సందర్భంలో ప్రత్యేకంగా మనదేశానికి ఉద్దేశించిన టీకాలను, తయారుచేశారు. ఈ టీకాలను ప్రయోగించేందుకు బీహార్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు–తమచే సృష్టించబడిన 'పాత్' అనే ప్రభుత్వేతర సంస్థ 'సేవలను' ఉపయోగించుకోవాలని ఒత్తిడిచేసి దాని ప్రయోగ కృషిని ప్రారంభించేందుకు ఆయా రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకున్నారు. దాని ఫలితమే ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో గిరిజన బాలికలపై ఔషధ ప్రయోగాల నిర్వహణ, కొందరు గిరిజన బాలికల దుర్మరణం! భారత ప్రభుత్వం గర్డాసిల్ అనే టీకాను తాత్కాలికంగా నిలుపుదల చేసిన తర్వాతకూడా మధ్యప్రదేశ్ పాఠశాల బాలికలపై అదే టీకాను ప్రయోగించారు. ఈసారి ఇండోర్, భోపాల్‌లలో 2010 అక్టోబరులో 'ప్రైవేటు టీకా ప్రయోగాలను' గర్డాసిల్ తయారీదారులైన గ్లాక్సో స్మిత్ క్లైయిన్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ మరియు మెర్క్ అండ్ కో అనుబంధమైన ఎం.ఎస్.డి. ఫార్మాష్యుటికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఉన్నత వర్గాలకు చెందిన పాఠశాలలో చేపట్టాయి. ఈ సంస్థలు ఇతర పాఠశాలల్లో కూడా ఈ ప్రయోగాలు కొనసాగించేందుకు ప్రయత్నించాయి. డాక్టరు ఆదేశాల మేరకు మాత్రమే ప్రైవేటు వ్యక్తులు ఆ టీకాలను వినియోగించగలరని ఐసిఎమ్ఆర్ తెలియ జేసింది. ఈ విధంగా 'ప్రైవేటు టీకా ప్రయోగాల' పేరిట ఐసిఎమ్ఆర్ ఈ ప్రయోగాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినా ఉపయోగం లేకుండా పోయింది. అంతేగాక, బడా ఔషధ కంపెనీలు అనైతిక విధానాలను మరోరూపంలో కొనసాగించటానికి మార్గాన్ని సుగమం చేసింది.

ఈ విధంగా వైద్య పరిశోధనకు రుణమంజూరు లేదా దాతృత్వం ముసుగులో ప్రధానమైన అంతర్జాతీయ వైద్య, ఔషధ కంపెనీల అనైతిక వ్యాపారం ప్రభుత్వాల నియంత్రణాధికార సంస్థల పరోక్ష మద్దతుతో నిరాటంకంగా కొనసాగుతున్నది. కాలంచెల్లిన క్షయ (టి.బి.) ఔషధాల, క్షయ పరీక్షలకు స్వస్తి పలికి, కొత్తవాటిని కనుగొనే పేరిట బిల్ గేట్స్–మిలిండా గేట్స్ ఫౌండేషన్‌ల 'దాతృత్వ' వైద్య పరిశోధనలు టీకాలకే పరిమితంకాక టి.బి. మందుల పరిశోధనకు కూడా విస్తరిస్తున్నాయి. ఇదేవిధంగా సి.ఎస్.ఐ.ఆర్ మరియు శాస్త్రసాంకేతిక శాఖల తోడ్పాటుతో మనదేశ వ్యవసాయ రంగంలోకి కూడా ఇవి ప్రవేశిస్తున్నాయి.

## ప్రభుత్వ ఆస్పత్రులలో ఔషధ ప్రయోగాలు

డిసెంబరు 2010లో జరిగిన మరో సంఘటనలో భోపాల్, ఇండోర్‌లలో ప్రభుత్వ ఆసుపత్రులలో నిర్వహించిన టీకా ప్రయోగాల గురించి వెలుగులోకి వచ్చింది. అమెరికా ప్రభుత్వ ఆహార, ఔషధశాఖ నిషేధించిన, మరియు మనదేశ ప్రభుత్వపు ఏవిధమైన ఆమోదంపొందని రెండు సహాయక ఔషధాలను (ధిమరోసల్ మరియు స్క్వాలెన్స్) ఈ ఆసుపత్రులలో ప్రయోగించారు. దీని ఫలితంగా వందలాది మంది బాలలు–చర్మవ్యాధులు, హైపర్ టెన్షన్, మెదడు దెబ్బతినటం, జనెటిక్ మ్యుటేషన్ వంటి అనేక తీవ్రమైన సైడ్‌ఎఫెక్ట్స్‌కి గురికావటంతోపాటుగా కీలకమైన కేంద్ర నాడీమండల వ్యవస్థ కూడా దెబ్బతిన్నది. భారతదేశంలో బాలల ఆరోగ్యాల్ని భద్రంగా పరిరక్షిస్తామనే ప్రభుత్వ సంస్థలయొక్క నిర్లక్ష్య, బాధ్యతారహిత, దుర్మార్గమైన వైఖరి ఈ విధంగా వుంది.

అమెరికా, తన దేశంలోని పిల్లలకు సంక్రమించే అరుదైన వ్యాధులకు అవసరమైన మందులను పరిశోధించి, నిర్ధారించుకోవటంకోసం భారతదేశం మరియు ఉగాండా దేశాలను తన ఔషధ పరీక్షల నిర్వహణకు వేదికలుగా ఉపయోగించుకుంటున్న విషయం 2010 డిసెంబరులో వెల్లడైంది. డ్యూక్ యూనివర్సిటిలో పిల్లల వ్యాధి నిపుణురాలుగా సేవలందిస్తున్న డా॥సారా డస్కోలి ఈ విషయాలను వెల్లడిచేశారు. మెల్‌మాస్టర్ యూనివర్శిటీకి చెందిన ఔషధ శాస్త్రవేత్త డా॥నాబెల్ ఘయార్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

బిల్–మిలిండా గేట్స్ ఫౌండేషన్ కార్యక్రమాలను అధ్యయనం చేసిన హర్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన డేవిడ్ స్టూకర్ బిల్ ఈ ఫౌండేషన్ చూపే దాతృత్వం అసలుప్రయోజనం, తనతో సంబంధాలను కలిగి వున్న ఔషధ కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలను పెంచటమేనని అభిప్రాయపడ్డాడు. టీకాలను ఉత్పత్తి చేసే బహుళజాతి కంపెనీలైన సనోఫిఅవెంతిస్, మెర్క్ వంటి వాటికి బిల్‌గేట్స్ కంపెనీలో వాటాలున్నాయి. బిల్‌గేట్స్ గ్లోబల్‌అలవెన్స్ ఫర్ వాక్సినేషన్ అండ్ ఇమ్మ్యూనైజేషన్ (గావి) అన్న స్వచ్ఛంద సంస్థను పెట్టాడు. ఇది 14 దేశాలకు 12 కంపెనీలు తయారు చేసిన 31 టీకాలను సరఫరా చేస్తున్నది. టీకాల కోసం **గావి** భారత ప్రభుత్వానికి 1.65 కోట్ల డాలర్ల సహాయంగా యిచ్చింది. దీనితో ఐదురకాల వ్యాధులకు టీకాలుగల (పెంటావాలెంటు) టీకా మందును 145/– రూ॥ కొని భారత ప్రభుత్వం వాడుతుంది. ఈ డబ్బు అయిపోయింతర్వాత 525/– రూ॥కు కొంటుంది. ప్రభుత్వం బలవంతంగా మూసివేసిన భారత ప్రభుత్వరంగ టీకా తయారీ సంస్థలు తయారు చేస్తే అయ్యేది 50/–రూ॥. ఈ 525/– రూ॥ పెట్టి ఈ టీకామందును శాంతా బయోటిక్ అన్న కంపెనీ నుండి కొంటుది. శాంతా బయోటిక్ తయారు చేసిన కామెర్ల టీకా సరైనది కాదని ప్రచారం చేసి, దాని ఎగుమతికి అనుమతులు రాకుండా విదేశీ కంపెనీలు ప్రచారం చేసాయి. ఈ విధంగా చెయ్యి మెలితిప్పి శాంతా బయోటెక్‌ను లొంగదీసుకుని సనొఫి అవెంతిస్ కంపెనీ కొనివేసింది. **గావి** ద్వారా ఇప్పుడు ఆ టీకానే అవెంతిస్ భారత ప్రభుత్వంతో కొనుగోలు చేయిస్తున్నది. టీకాల రంగంలో గుత్తాధిపత్యం కొరకు అభివృద్ధి చెందుతున్న దేశాల వాక్సిన్ ఉత్పత్తి దారుల నెట్‌వర్క్‌ను పెట్టి ఏదో ఒక రూపంలో బిల్‌గేట్స్‌తో సంబంధమున్న కంపెనీల టీకాల అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారు. దాతృత్వపు అసలు విషయం ఇదే. ఈ టీకాల వినియోగమేకాక, ఈ టీకాలను కనుగొనేందుకు జరగాల్సిన ఔషధ ప్రయోగాలను కూడా వెనుక బడ్డ దేశాలలో సాగించటానికి **గావి** "సహాయం" చేస్తున్నది. భద్రాచలంలో గిరిజన బాలికలపై గర్భసంచి ముఖద్వార కాన్సరు టీకా పరీక్షలకు ఆర్థిక సహాయమందించింది బిల్‌గేట్స్‌గారి **గావినే.**

ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత ఆరోగ్య మంత్రిత్వశాఖ తోడ్పాటుతో భారతదేశీయ వైద్య విధానాల రూపకల్పనా చర్చలలో జోక్యం చేసుకుంటున్నదని 12 ప్రముఖ భారతీయ ఔషధ కంపెనీలతో కూడిన భారత ఔషధ కూటమి (ఐ.పి.ఎ.) ఆరోపించింది. ఔషధ ప్రయోగాలకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వం తమకు అందించాలని అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు వత్తిడి చేస్తున్నాయని ఆరోపించింది. భారత ప్రభుత్వం దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని బయటపెట్టక పోయినప్పటికీ 'ట్రిప్స్' ఆధారంగా అది ఈ విధంగా వ్యాఖ్యానించింది.

## ఖర్చు తక్కువలో ప్రయోగాలు–శిక్షలు లేకుండా సదుపాయాలు

ఔషధ ప్రయోగ పరిశ్రమను పెంచి పోషించటంలో సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాద ఔషధ పరిశ్రమల కుటిలమైన పాత్ర ఇది! వివిధ శాస్త్రీయ పరిశోధన, శాస్త్రతాత్వికతా, నిధుల మంజూరు వంటి ముసుగులో వారి ఔషధ ఉత్పత్తుల విక్రయానికి వారి ఔషధ ప్రయోగాలకు, పరిశోధనకు భారతదేశం 'భద్రమైనది'గా ఎంచుకొని తమ కుటిల విధానాలను సాగిస్తున్నారు. ఎందుకంటే ఔషధ ప్రయోగ జంతువులుగా ఉపయోగపడే నిరక్షరాసులైన ప్రజలకు, వారి దుర్మార్గాన్ని ప్రశ్నించే జ్ఞానంగానీ, సామర్థ్యంగానీ లేదా తమకు రావలసిన పరిహారాన్ని గురించి గట్టిగా నిలదీసే స్తోమతగానీ లేదు. మీదుమిక్కిలి అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలలోని కఠినతరమైన చట్టాల కారణంగా కూడా భారతదేశం ఔషధ ప్రయోగాల నిర్వహణకు భద్రమైన గమ్యంగా బహుళజాతి కంపెనీలకు తయారైంది. అతితక్కువ ఖర్చుతో ప్రయోగాలు జరపగలగటం అనేది దీనికి తోడైన ఆకర్షణ. కావున, ఔషధ ప్రయోగ పరిశ్రమను మౌలికంగా మన దేశంలో పెంపొందించటమనేది సామ్రాజ్యవాద ఔషధ కంపెనీల ప్రయోజనాలను మరింతగా కొనసాగించేందుకేననేది స్పష్టం.

బహుళజాతి కంపెనీల సూపర్ లాభాల సముపార్జన అనేది భారతదేశంలో ఔషధ ప్రయోగాల నిర్వహణ వెనుకనున్న ప్రాథమిక స్వభావం! కాగా ఈ ఔషధ పరీక్షలు ప్రజలు ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు, ప్రజలకు సంక్రమించిన వ్యాధుల్ని నివారించేందుకు, మానవజాతి పురోగమనానికీ నిర్వహించ బడుతున్నాయనీ; నైతికత, నైతిక పరీక్షలు గురించి వారు మాట్లాడే మాటలను అమాయకంగా నమ్మరాదు. ఎందుకంటే సూపర్ లాభాల సంపాదనే వారి ఏకైక ఉద్దేశ్యం కనుక! ఔషధ లేదా మందుల ప్రయోగ పరీక్షల గురించి వీరు వల్లించే నీతులు ప్రజల కళ్ళకు గంతలు కట్టడం తప్ప మరొకటికాదు.

సామ్రాజ్యవాద ప్రయోజనాలకు లోబడిన భారత పాలకులకు, సంబంధిత ప్రభుత్వ వ్యవస్థలకు మనదేశ ప్రజల పట్ల, వారి హక్కులపట్ల, వారి భద్రతారక్షణల పట్ల ఏ మాత్రం ఆసక్తిలేదు. ప్రజల ప్రయోజనాల కోసమే తాము పనిచేస్తున్నామనే ఫోజు మినహా వాస్తవానికి, సామ్రాజ్యవాద మందుల కంపెనీల వ్యాపారం అభివృద్ధి చెందేందుకు, ఏ విధమైన ప్రతిఘటనా లేకుండా సులభ మార్గంలో వారి దోపిడీ సాగించుకునేందుకు ఆచరణలో తోడ్పడుతున్నారనేది స్పష్టమే.

## సామ్రాజ్యవాదులకు లోబడిన ఔషధ నియంత్రణ సంస్థలు

భారత వైద్య, పరిశోధనా మండలి పైపై చూపులకు భారతవైద్య రంగానికి బాధ్యతాయుత నాయకుడుగా కనిపిస్తుంది. ఈ సంస్థ కోచ్‌రేన్ లైబ్రరీలో సభ్యత్వం పొందటం ద్వారా ఆ లైబ్రరీకి అందే సమాచారాన్నంతా ఆన్‌లైన్‌లో సేకరించుకునే సౌకర్యాన్ని కలిగివుంది. ఆ విధంగా ప్రపంచ వ్యాపితంగా సక్రమంగా నిర్వహించబడిన ఔషధ పరిశోధనలు, వాటి ఫలితాల వివరాలన్నీ భారతవైద్య పరిశోధనామండలికి అందుబాటులో వుంటాయి. కానీ, వాస్తవ ఆచరణలో ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన బాలికలపై హెచ్.పి.వి. టీకా ప్రయోగాల వంటి అనైతిక ఔషధ ప్రయోగాలకు, మోసపూరిత విధానాలకీ తన ఆమోదాన్ని తెలుపుతూ ఈ పరీక్షలకు మానవులను ఔషధ ప్రయోగ జంతువులుగా సమకూర్చుతున్నది.

భారతదేశంలో అత్యున్నత ఔషధ నియంత్రణా సంస్థ డిసిజిఐ ఈ ఔషధ పరీక్షలకు ఆమోదం తెలుపుతున్నది. ఔషధ ప్రయోగాల సందర్భంగా ఏర్పడిన గాయాలులేదా మరణాల బాధ్యతల విషయంలో ఔషధ ప్రయోగాల ప్రయోజనాలను పరిరక్షించే పేరిట చాకచక్యంగా విదేశీ ప్రాయోజితులను నష్టపరిహారం చెల్లించే బాధ్యతలనుండి ఇది తప్పించి వేసింది. ఈ బాధ్యతను బహుళజాతి ఔషధ సంస్థల తరపున ఔషధ ప్రయోగాలు చేపట్టే కాంట్రాక్టు రీసెర్చ్ ఆర్గనైజేషన్స్ (సి.ఆర్.ఒ.–పరిశోధనకు గుత్తేదారు సంస్థలు) మీదకు మళ్ళించివేసింది. దీనితో, ప్రస్తుతం ఈ ఔషధ ప్రయోగాలకు కీలకమైన సంస్థలు విదేశీ ప్రాయోజితులే ఐనప్పటికీ నష్టపరిహారం చెల్లింపు విషయంతో సహా మరే విధమైన ఆరోపణలూ వారిపై చేయటానికిగానీ, వారిపై బాధ్యతలను మోపటానికిగానీ అవకాశం లేకుండా పోయింది.

ప్రస్తుతం భారతదేశంలో 120 సి.ఆర్.ఓలు ఔషధ ప్రయోగాల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయి. సి.ఆర్.ఓ.లకు ఔషధ ప్రయోగవ్యాపారం అతిపెద్ద లాభసాటి వ్యాపారమైంది. విజయవంతమై ఆమోదం పొందితే, వారి ఔషధ తయారీ పరిశ్రమ వాటాల విలువ ఆఘమేఘాల మీద పెరిగిపోతుంది.

2010 జూన్‌లో జైడస్ కాడిల్లా గ్రూపుకు చెందిన కాడిలా హెల్త్‌కేర్ సంస్థకు మధుమేహ వ్యాధి నిరోధక 'జ్యోగి' అనే అణువుకు సంబంధించి మానవులపై సాగించిన మొదటిదశ ఔషధ ప్రయోగానికి గానూ ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం అందుకున్న వెంటనే దాని షేరు విలువ 52 వారాల గరిష్ట ధర రు. 664.95 చేరుకుంది. భారతదేశంలో ఔషధ ప్రయోగాల వ్యాపారంలో బ్రహ్మాండమైన లాభాలు ఈ విధంగా వుంటాయి మరి! ఈ పరిస్థితుల్లో నటించటం కోసమైనాగానీ నైతిక ప్రమాణాల గురించి లెక్క జేసేదెవరు?

జులై 2010లో బహుళజాతి ఔషధ పరిశ్రమలు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని ఎజిఎం వైద్యకళాశాల ఆసుపత్రిలోని వైద్యులకు లంచాలు ఎరచూపుతున్నదనీ ఆ ఆసుపత్రిలోని రోగులపై ఔషధ ప్రయోగాలను చేసేందుకు ఆశలు చూపుతున్నదనీ ఒక ఎన్జీవో ఆరోపించింది.

ఆర్థిక నేర నిఘా విభాగం జరిపిన విచారణలో ఇది వాస్తవమేనని నిర్ధారణైంది. ఔషధ లేదా మందుల ప్రయోగ రంగంలో మెర్క్ అండ్ బోయిసిల్ శాన్‌క్యో ఫార్మా డెవలప్‌మెంట్ వంటి అతిపెద్ద అమెరికన్ పరిశ్రమ, స్విస్‌కు చెందిన ఎఫ్‌హాస్‌మన్ లారోఛి లిమిటెడ్ వంటివి, ఈ విధమైన చట్టవిరుద్ధ, అనైతిక వ్యాపార పద్ధతులకు తరచుగా పాల్పడుతున్నాయని తేటతెల్ల మౌతున్నది.

ఈనాటి ఆరోపణల దగ్గరకొస్తే కూడా యాక్సిస్ లేబరేటరీస్‌కు ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ కూడా లేదు. వైద్య పరీక్షల కేంద్రంగా మాత్రమే (డయాగ్నాస్టిక్ సెంటర్) అనుమతి పొందింది. అయినా ఔషధ ప్రయోగాలను నిర్వహిస్తున్నది. దీని అనైతిక ఔషధ ప్రయోగాల ఆరోపణలపై విచారణ జరిపిన డిసిజిఐ బృందం, ఈ ప్రయోగాలు నిర్వహించిన యాక్సిస్ లేబరేటరీ నైతిక ప్రమాణాలను ఉల్లంఘించిందని కనుగొంది. ఈ అత్యున్నత సంస్థ–యాక్సిస్‌లాబ్ అనుమతిని రద్దు చేస్తున్నట్లుగానూ, ఇలాంటి చర్యతో విషయమంతా సమసి పోయినట్లుగానూ, మొత్తం సమస్య పరిష్కరించబడిపోయి నట్లుగానూ ఆర్భాటంగా ప్రకటిస్తున్నది.

## నైతిక కమిటీల దుస్థితి

పేదలను, దుర్బలురను, నిరక్షరాస్యులను, గిరిజనులను దౌర్జన్యపూరితంగా ఔషధ ప్రయోగాలకు ఉపయోగించకుండా నైతిక కమిటీలుండివుంటే, అవి నియంత్రించి వుండేవనే చర్చ నలుగుతున్నది. ఏమైనా ఈ అనుభవం మరో విధంగా కనిపిస్తున్నది. ఔషధ ప్రయోగాలను నియంత్రించేందుకు నైతిక కమిటీలకు సంబంధించిన విషాదం ఇక్కడేవుంది. ఔషధ ప్రయోగాలు నిర్వహించే కంపెనీనే నైతిక కమిటీలనేర్పరచటంతో ఈ కమిటీల ప్రభావమే నిరుపయోగంగా మారిపోతున్నది– ఎందుకంటే తమను నియమించిన కంపెనీల ప్రయోజనాలకు విరుద్ధంగా ఈ కమిటీలు వ్యవహరించ లేవుకదా! 2009 నవంబరులో విశాఖపట్నంలో ఏసిమస్ బయోకంపెనీ నిర్వహించిన అనైతిక ఔషధ ప్రయోగాలు దీనికి ఒక ఉదాహరణ, ఒక అనుభవం కూడా. ఇక్కడ కంపెనీచే నియమించబడిన ఒక నైతిక కమిటీ వుంది. కానీ దీనిలో తగిన శక్తి సామర్థ్యాలు కలిగి, కంపెనీ నిర్వహించే అనైతిక అచరణను ప్రశ్నించగలిగే స్థాయిలో ఎవరూలేరు. పేద ప్రజలను గినీపిగ్స్‌గా ఉపయోగిస్తూ ఆ కంపెనీ నిర్వహించే అనైతిక ఆచరణలను అది నియంత్రించలేకపోయింది.

డిసిజిఐ డిమాండ్ మేరకు తక్షణ నష్టపరిహార చెల్లింపు ఇటీవలికాలంలోని హాస్యాస్పదమైన ఉదాహరణ.

ప్రధానమైన బహుళజాతి ఔషధ కంపెనీలు గ్లాక్సో స్మిత్‌క్లైన్, జాన్సన్ అండ్ జాన్సన్, సోనోఫి అవెంటిస్, ఎమ్ఎస్‌డి, నోవార్టిస్, బ్రిస్టర్ మేయర్స్, స్క్విబో, బేయర్ హెల్త్ కేర్, ఆస్ట్రాజెనికా, ఫీజర్ మొదలైనవి; మరియు క్విటిల్స్. ఐకాన్, జివికె బయో, సిరో, క్లిమ్‌ఫార్మా, పారాక్సిల్, పిఆర్ఏ ఇంటర్‌నేషనల్, పిపిడి, కోవాన్స్, కోమీకేర్, మరియు కోండల్ వంటి దేశీయ కంపెనీలు మన దేశంలో జరిగే ఔషధ ప్రయోగాలలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి.

2010 కాలంలో, ఔషధ ప్రయోగాల క్రమంలో 671 మరణాలు సంభవించాయి. వాస్తవానికి ఈ మరణాలు సంభవించిన ఔషధ పరీక్షల సందర్భంగా వీటిని నియంత్రించే నైతిక కమిటీలువున్నాయి. కానీ ఈ విధమైన 671 మరణాలలో కేవలం 25 మరణాలను మాత్రమే నష్టపరిహారానికి అర్హమైనవిగా కంపెనీ యజమాన్యాలు ఆమోదించాయి. ఎందుకంటే ఔషధ ప్రయోగాల సంబంధిత కారణంగా మరణించారని వారిని మాత్రమే ఆరోగ్య మంత్రిత్వశాఖ, డిసిజిఐ గుర్తించింది కనుక! మిగిలిన కేసులన్నీ నష్టపరిహారానికి అనర్హమైనవిగా తిరస్కరించబడ్డాయి. ఎందువలనంటే ఔషధ ప్రయోగాల క్రమంలో 'వలంటీర్స్'లో సహజంగా సంభవించిన మరణాలుగా వీటిని నిర్ధారించారు గనుక! ఔషధ ప్రయోగాలలో 88 శాతం మరణాలు క్యాన్సర్, గుండె సంబంధమైన, మెదడు సంబంధమైన అవ్యవస్థ కారణంగా సంభవించినవేనని చిత్రించారు. కంపెనీలే నియమించిన ఈ ఔషధప్రయోగ పరిశోధకులు ఈ ప్రయోగఫలితంగా ఈ మరణాలు సంభవించలేదని కనుకనే నష్టపరిహారానికి మృతులు అనర్హులని నొక్కి చెపుతున్నారు. కాగా ఈ ప్రకటన పట్ల నైతిక విలువల కమిటీలు మౌనం వహిస్తున్నాయి. నష్టపరిహారానికి యోగ్యమైనవిగా గుర్తించిన కేసులలో కూడా 9 కేసులకు నష్టపరిహారం చెల్లింపులు జరగలేదు. మరణించినవారి వారసులను గుర్తించక పోవటమే **(తరువాయి 6వ పేజీలో)**

# చేనేతరంగ రక్షణకై ఉద్యమిద్దాం!

## ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం పిలుపు

**రాష్ట్ర** వ్యాప్తంగా చేనేతరంగం తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. దశాబ్దాల కాలంగా ఆకలిచావులతో, ఆత్మహత్యలతో ఎదురీదుతూ చివరకు వృత్తి అంతరించిపోయే దశకు చేరుకుంది. తరతరాలుగా పడరాని కష్టాలు పడుతూ ఈ వృత్తిలోనే మనుగడ సాగించిన కార్మికులు, వారి మనుగడ ప్రశ్నార్ధకంగా మారటంతో దిక్కుతోచక వృత్తిని వదిలివేస్తున్నారు. దాదాపుగా 3వ వంతు మంది కార్మికులు ఇప్పటికే వృత్తిని వదిలివేశారు. వీరందరూ నైపుణ్యంలేని ఏదోఒకపనిలో చేరి కడుపులు నింపుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. అక్కడకూడా పని దొరకక పోతుండటంతో వారి పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడినట్లవుతున్నది. ఈ వృత్తినే నమ్ముకుని వెనక్కు వద్దామంటే చేనేతలో కడుపాకలి తీరటం లేదు.

ఈ వృత్తినే నమ్ముకుని, బయటి పనులకు వెళ్ళలేని లక్షలాదిమంది చేనేత కార్మికులు ఈ వృత్తిలో జీవనభృతి కరువై జీవన్మరణ పోరాటంలో కొట్టుమిట్టాడుతున్నారు. సరిగ్గా ఇదే పరిస్థితి అలానే ఇంకొంతకాలం కొనసాగితే పక్షిజాతుల్లో హంసజాతి అంతరించి పోయినట్లుగానే చేతివృత్తుల్లో చేనేతకూడా అంతరించిపోతుంది. మరి ఈ పరిస్థితుల నేపథ్యంలో సగటు కార్మికుడు మనుగడ సాగించాలంటే ఏమిచేయాలి? బ్రతుకు దెరువుకు మన ముందున్న మార్గాంతరం ఏమిటి? వృత్తిని రక్షించుకోవటం మినహా కార్మికుని జీవన భద్రతకు మరేదైనా మార్గం వుందా? మరి వృత్తిని కాపాడుకోవటం ఎలా?

### ప్రయోజనం లేని ప్రభుత్వ పథకాలు

వారం రోజులుగా పస్తులతో, ఆకలితో, మలమల మాడే వానికి ఖాళీవిస్తరి,మంచి నీళ్లగ్లాసు ఇచ్చి సుష్టుగా భోంచేయమని ఫోజుపెట్టినట్లుగా వున్నాయి-మన ప్రభుత్వం చేనేతకు ప్రకటించిన పథకాలు! చేనేత కార్మికులకు దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనం కల్పించే పథకంగానీ, ఉపాధిని మెరుగుపరిచే పథకంగానీ, వృత్తిని అభివృద్ధి పరుచుకునేందుకు తగిన మౌలిక వసతులు గానీ, కల్పించిన పథకం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. సహకార సంఘ సభ్యులకు వర్తించే "త్రిఫ్ట్‌పథకం", విద్యార్థులకు రెండేళ్ళ స్కాలర్‌షిప్ పథకం, ఇన్సూరెన్స్ పథకం ఎవరికీ ఉపయోగపడలేదు. వృద్ధాప్యపెన్షన్‌లు ఏ ఒక్కరినీ ఆదుకోలేదు. ఆర్టిజాన్ క్రెడిట్‌కార్డులు, హెల్త్ కార్డులు అట్టడుగు చేనేత కార్మికులకు అందనే లేదు. ఆచరణలో నిరర్ధకంగా మిగిలిపోయాయి. దీనదయాళ్ హత్‌కార్‌షా పథకం అడ్రసే ఇంతవరకూ లేదు.

చేనేత రంగంలో యజమానుల దోపిడీకి ప్రత్యామ్నాయంగా, స్వయం ఉపాధికి మార్గంగా చెప్పబడుతున్న సహకార సంఘాలు 80 ఏళ్ళ అనుభవంలో నిరర్ధకమని ఋజువైపోయింది. అవి కేవలం పాలకవర్గాల రాజకీయ నిరుద్యోగులకు అలంకార పీఠాలుగా మిగిలిపోయాయి. కేంద్రప్రభుత్వం నడిపే చేనేత క్లష్టర్ ప్రోగ్రాం కేవలం అధికారులకు నిధుల పంటగాను, శిక్షకులకు కాలక్షేపంగానూ తప్ప మరే విధంగానూ వృత్తికి ఉపయోగపడలేదు. పైగా ఈ పథకాలన్నీ స్వభావరీత్యా పై పూతమందులే తప్ప చేనేతలో నానాటికీ తీవ్రమౌతున్న సంక్షోభాన్ని పరిష్కరించేవికావు. కనీసం ఉపశమనాలైనా కావు. చేనేతను ఆదుకునేందుకని రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న టెక్స్‌టైల్ పార్కులు చేనేత కార్మికులను ఎంతమాత్రమూ ఆదుకోలేవని, ఎలాంటి ప్రయోజనాన్నీ కల్గించలేవని టి-పార్కుల అనుభవాలు మనకు ఋజువు చేస్తున్నాయి.

ఈ పథకాల మాయమాటల మాటున చేనేతను సమూలంగా ధ్వంసం చేసే చర్యలు ప్రభుత్వం చేపట్టింది. ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించాలంటూ, అంతర్జాతీయ పోటీలో నిలబడాలంటే ఆధునిక యంత్రాల దిగుమతికి పూనుకుంది. ఒక పవర్ మగ్గం 12 చేమగ్గాల ఉపాధిని దెబ్బతీస్తుందని 1978లోనే శంకరన్ కమిటీ హెచ్చరించినప్పటికీ చేనేతకు పవర్‌లూమ్ పోటీని చట్టబద్ధంగా అనుమతించింది. చేనేతకు 22 రకాల వస్త్రాలు రిజర్వుచేసి వృత్తిని రక్షిస్తామని నాటకమాడి ఆచరణలో వాటినికూడా పవర్ మగ్గాల పరం చేసింది. 1994లో చిలప నూలుపై 9.2 శాతం ఎక్సైజు సుంకం విధించింది. 1998లో 22 చేనేత రకాల రిజర్వేషనును 11 రకాల కుదించి మిగిలిన ఆ 11 రకాలను అధికారికంగా పవర్‌లూమ్‌లకే అప్పగించింది. చేనేతకు కేటాయించిన ఆ 11 రకాలను కూడా పవర్ మగ్గాలు అనధికారికంగా ఉత్పత్తి చేస్తున్నా నివారించడం తనపని కాదన్నట్లు చర్యలు చేపట్టకుండా వదిలేసింది. 1999లో సత్యం కమిటీ సిఫార్సులు పూర్తిగా చేనేత ఉసురు తీశాయి. చేనేతకు ప్రాణాధారమైన చిలుపల నూలు ఉత్పత్తిలో మినహాయింపులిస్తూ, కాన్‌యార్న్ ఉత్పత్తిపై నియంత్రణను ఎత్తివేసింది. దీంతో తీవ్రమైన ముడి సరుకుల కొరతను చేనేత ఎదుర్కొంది. అధిక ధరల భారాన్ని కూడా మోయవలసి వస్తోంది. ఈ సమయంలోనే అధునాతన యంత్రపరిశ్రమలు స్థాపించాలంటూ పాలకులు ముందుకొచ్చారు. ప్రైవేటు పెట్టుబడిదారులను ప్రోత్సహించారు. ఈ పదేళ్ళకాలంలో మరింత బాహాటంగా "గుంటూరును ఆంధ్రాసూరత్ చేస్తామంటూ" కాంపోజిట్ మిల్లులను ప్రోత్సహించారు. వందల, వేల కోట్ల రూపాయల ప్రైవేటు పెట్టుబడులతో భారీ యంత్ర పరిశ్రమలకు ప్రభుత్వం ప్రత్యక్ష సహాయ, సహకారాలను అందించి ప్రోత్సహించింది.

### అధునాతన భారీ పరిశ్రమలు - ఒక పరిశీలన

ఇటీవల కాలంలో రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఈ పరిశ్రమలను స్థాపించారు. ప్రత్తి జిన్నింగ్, స్పిన్నింగ్ విభాగాలతో కూడిన మూడు యూనిట్లను గుంటూరుజిల్లా యడ్లపాడు, చందోలు; ప్రకాశం జిల్లా ఇంకొల్లులలో స్థాపించారు. నిమిషానికి 400 నుండి 600 పోగులు నేయగల అత్యాధునిక ఎయిర్ జెట్, వాటర్ జెట్‌లూమ్‌లు ఇక్కడ ఉన్నాయి. ఒక్కో లూమ్ ఖరీదు 40 నుండి 50 లక్షల రూపాయలు వుంటుంది. ఒక్కొక్కలూమ్ రోజుకు 200 మీ॥ బట్టను ఉత్పత్తి చేయగల్గుతుంది. ఒక కార్మికుడు 6 లూములు నడుపగల్గుతాడు. 250 లూములు గల ఒక యూనిట్‌కి షిఫ్టుకు 45 మంది చొప్పున 3 షిఫ్టులకు 135 మంది కార్మికులు సరిపోతారు. అంటే ఒక్క రోజులో 50 వేల మీటర్ల ఉత్పత్తి సాధించగలరు. అది 10 వేల మంది చేనేత కార్మికులు చేసే ఉత్పత్తితో సమానం. అంటే 250 లూమ్‌లు 10 వేలమంది చేనేత కార్మికుల ఉపాధిని ధ్వంసం చేస్తున్నాయి. స్పిన్నింగ్, జిన్నింగ్, వార్పింగ్, వీవింగ్ విభాగాలన్నింటిలో కలిపి కేవలం 500 మందికే ఉపాధి కల్పిస్తుంది. వారు కూడా చేనేత వారు కాదు.

గుంటూరు, ప్రకాశం జిల్లాలలో స్థాపించిన 3 యూనిట్ల విలువ 1200 కోట్లు. ఈ మూడు యూనిట్లు కలిసి చూపే ఉపాధి ఎక్కువలో ఎక్కువ 2000 నుండి 2500 మందికి మాత్రమే. కానీ ఒక చేమగ్గం ఏర్పాటు చేయటానికి కావాలసిన ముడి సరుకులు, సరంజామా, పెట్టుబడి అంతా కలిపి 30 వేలకు మించి ఖర్చవదు. ఈ ప్రకారం 1200 కోట్ల రూపాయలతో 4 లక్షలమందికి ఉపాధి చూపించవచ్చు. హౌస్ కం వర్క్‌షెడ్‌తో కలిపి 1 మగ్గానికి 1 లక్ష ఖర్చవుతుందనుకున్నా కనీసం 1లక్షా 20 వేల మందికి ఉపాధి చూపించవచ్చు. పాత పద్ధతి, వెనుకబడ్డ పద్ధతి అనుకుంటున్నప్పటికీ 5 నుండి 10 లక్షల మీటర్ల ఉత్పత్తిని ఒక్క రోజులో సాగించవచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం ఇందుకు పూనుకోదు. ఎందుకంటే కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు బడా పారిశ్రామిక వేత్తల బొజ్జలు నింపేందుకే ప్రభుత్వం సిద్ధమైంది.

### పవర్‌లూమ్ కార్మికుల ఆత్మహత్యలు

1970 - 90 దశాబ్దాలలో పవర్‌లూమ్ ప్రత్యామ్నాయ ఉపాధిగా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. అభివృద్ధికి సూచికగా చూపింది. అనేక లక్షల పవర్ మగ్గాలు జపాన్ నుండి దిగుమతి చేయబడ్డాయి. లక్షలాదిమంది కార్మికులు అటువైపు తరలించబడ్డారు. కారు చౌకగా వారి శ్రమశక్తిని కొల్లగొడుతూ వారికి ఎలాంటి హక్కులు కల్పించే బాధ్యతా లేకుండా బడా బూర్జువాలు దోపిడీ చేసారు. అంతిమంగా 1990 దశకం నుండి నేటివరకూ చేనేత కార్మికుల ఆత్మహత్యలకంటే అధికంగా పవర్ మగ్గాల కార్మికులు ఆత్మహత్యలకు బలైపోయారన్నది కటిక నిజం. ఇలాంటి ఆటుపోట్లను సైతం తట్టుకుంటూ నాటి బ్రిటీష్ ముష్కర పాలన నుండి నేటి వరకూ చేనేత మనుగడ సాగిస్తూనే ఉన్నది. అందుకు ప్రధాన కారణం కార్మికుల కళా నైపుణ్యం మినహా మరొకటికాదు.

### చేనేతకు డిమాండ్ లేదా? మార్కెట్ లేదా?

భారత చేనేత పరిశ్రమకు విశాలమైన మార్కెట్ వుంది. అంతర్జాతీయ ఖ్యాతిగల్గిన భారతదేశపు చేనేతబట్ట ప్రపంచ మార్కెట్‌లో తన స్థానం నిలబెట్టుకుని విశేషంగా విదేశీ వినియోగదారులను ఆకర్షిస్తోన్నది. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతోంది. అంతేస్థాయిలో దేశీయ మార్కెట్‌లో సైతం తన విశిష్టతను నిలబెట్టుకుంటూ వస్తున్నది. జనతా వస్త్ర ఉత్పత్తిని ప్రోత్సహిస్తే మార్కెట్ నిస్సందేహంగా మరింతగా విస్తరిస్తుంది .

### వృత్తిరక్షణకు మన ముందున్న మార్గం

అధిక సంఖ్యలో మానవ వనరులు, శ్రమశక్తికల మన దేశంలో అతితక్కువ పెట్టుబడితో, అధిక సంఖ్యాకులైన ప్రజలకు ఉపాధి చూపగల్గిన రంగం చేనేత. ఈ రంగాన్ని సహజరీతిన అభివృద్ధి చెందేలా చూడటం, ప్రోత్సహించటం మాత్రమే ఉపాధి కల్పనకి మార్గం. దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది ప్రజలకు నామమాత్రపు పెట్టుబడితో ఉపాధి చూపగల్గుతుంది. ఇలాంటి ఉపాధికల్పనా రంగాన్ని రక్షించుకోవటం మన సామాజిక బాధ్యత, అంతకు మించిన సామాజిక అవసరం. అందుకు మన ముందున్న మార్గం ఒక్కటే, ప్రభుత్వమూ, పాలకవర్గాలు నేటివరకూ చేపడుతూ వచ్చిన చేనేత వ్యతిరేక విధానాలకి స్వస్తి చెప్పి, మొత్తంగా వృత్తి రక్షణను చేపట్టాలి. అందుకుగాను చేనేత రంగాన్ని ప్రొవిన్సిలైజ్ (రాష్ట్ర ట్రెజరీ ద్వారా జీతాలు అందేవిధంగా) చేయాలి. అన్ని ప్రభుత్వరంగ సంస్థల మాదిరి కార్మికులను నెలసరి ఉద్యోగస్తులుగా తీసుకోవాలి. అన్ని రకాల కార్మిక హక్కులను, ఇంక్రిమెంట్, పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ., గ్రాట్యుటీ తదితర వసతులను కల్పించాలి. సరిగ్గా ఈ విధానం ద్వారానే వృత్తి రక్షింపబడుతుంది. ఉపాధి శాశ్వతమౌతుంది. కావున ఈ డిమాండ్ సాధనకోసం చేనేత శ్రేణులందరూ ఉద్యమించాలని పిలుపునిస్తున్నాము.

**ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం**
**(ఏపిఎఫ్‌టియు అనుబంధం)**

---

### అనైతిక ఔషధ... (5వ పేజీ తరువాయి)

దీనికి కారణం. మరలా ఈ సందర్భంలోనూ 'నైతిక విలువల కమిటీ' ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే వుంది. ఇది ఔషధ ప్రయోగాల నిర్వహణలో నైతిక కమిటీల దుస్థితి!

కానీ, ఇదే ఒక అభివృద్ధి చెందిన దేశంలోనైతే, ఔషధ కంపెనీలకు వారి ఔషధ ప్రయోగాల నిర్వహణకు అవసరమైన 'వలంటీర్స్'ను పొందటమే అసాధ్యమైన కర్తవ్యంగా మిగిలిపోతున్నది. అంతేగాక అత్యంత కఠినతరమైన ఆయాదేశాల నిబంధనలకు కట్టుబడి తీరాలి. ఇంటర్‌సెల్ అనే అమెరికాకు చెందిన కంపెనీ ఒక ఔషధ ప్రయోగ అధ్యయనం కోసం 1800 మంది 'వలంటీర్స్'ను సేకరించటానికి నానా తంటాలూ పడవలసి వచ్చింది. 2009 డిసెబర్ 31న బ్రిటీష్ డైలీ 'ది ఇండిపెండింట్'లో 'లండన్ : 1800 మంది వలంటీర్లు కావలెను-మెక్సికో, గ్యాటిమాలాలకు ఉచిత శలవుల ప్యాకేజి' అని ప్రకటించారు. ఈ ''పర్యాటక అధ్యయనం''లో పర్యాటకుల విరేచనాల లక్షణాలు కన్పించిన వాలంటీర్లు అక్కడ ఆస్పత్రికి వెళ్ళాలి. అక్కడ వారికి కొత్త మందును ఇంజక్షనుగా యిచ్చి, వారి ప్రతిస్పందనలను గమనిస్తారు. 1500 డాలర్ల శలవుల ప్యాకేజీలో త్రీస్టార్ హోటల్‌లో నివాసం కల్పించారు కానీ, ఔషధ ప్రయోగానికి సిద్ధమైన 'వలంటీర్స్' ఎక్కడికైనా వెళ్ళి, ఏమైనా తాగొచ్చు, అయితే పరీక్షా కేంద్రానికి 3 గంటల్లో చేరగల దూరం మాత్రమే వెళ్లాలి. ఎందుకంటే ఆ సమయానికి వలంటీర్ల రక్త, మల నమూనాలను సేకరించి పరీక్షించవలసి వుంటుంది. చట్టపరమైన బీమా, సైడ్‌ఎఫెక్టులకు తగిన నష్టపరిహారం, ఆరోగ్య సేవలను అందించే హామీ వంటి వాటితో కూడా ప్రలోభ పరచటం వంటి చర్యలన్నీ చేపట్టాలి.

కానీ, మన దేశంలో మన పాలకులూ ప్రభుత్వాలూ కుమ్మక్కు కావటంతో నిరుపేదలపైన నిరక్షరాస్యులపైన దుర్బలురపైన ఏవిధమైన శిక్షలకు అవకాశం లేకుండా తప్పించుకుంటూ అనైతిక, మోసపూరిత పద్ధతుల్లో ఔషధ ప్రయోగాలు సాగిపోతున్నాయి.

#### ఔషధ ప్రయోగాలకు మార్గదర్శకాలు

అయితే ఇక్కడ కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. ఔషధాలను కనుగొనటానికీ, అవి మనుషుల వ్యాధులను తగ్గించగలవో లేవో తెలుసుకోవటానికీ ఔషధ ప్రయోగాలు జరపాలికదా? వాటిని నిషేధిస్తే వ్యాధులకు మందులను కనుగొనలేముకదా? దీనికి పరిష్కారం వుంది. రోగులకు అన్ని విషయాలు వివరించి వారి స్వచ్ఛంద అనుమతితో ఇలాంటి పరీక్షలు నిర్వహించవచ్చును. అలాగే అన్ని విషయాలు తెలిసిన తరువాత స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వారిపైన కూడా ప్రయోగాలు చేయవచ్చును. ఇలాంటి ప్రయోగాలకు ఉండవలసిన మార్గదర్శకాలూ, నియమనిబంధనలేమిటి? వాటిని ఎవరు రూపొందించాలి అన్న ప్రశ్నలు కీలకమైనవి.

1920-30లలో ఖైదీలపై, నీగ్రోలపై, సంచార తెగలపై ఇలాంటి ప్రయోగాలు చేసేవారు. వీటిపై విమర్శలు రావటంతో 1948లో వివిధ దేశాల శాస్త్రవేత్తలతో కూడిన బృందం 10 నైతిక సూత్రాలను రూపొందించి ప్రకటించారు. దీనిని న్యూరెంబెర్గ్ కోడ్ అని పిలుస్తున్నారు. తిరిగి 1964లో వివిధ దేశాలకు చెందిన వైద్యుల బృందం హెల్సింకీలో సమావేశమై ఈ నైతిక సూత్రాలను విస్తరించి మార్గదర్శక సూత్రాలను ప్రకటించారు. దీనిని హెల్సింకీ ప్రకటన అనిపిలుస్తారు. 1974లోనూ, తిరిగి 1983, 1984లోనూ వచ్చిన అనుభవాల నుండి వీటిని సవరించి మరింత మెరుగుపరిచారు. ఈ సూత్రాలలో ప్రధానమైన అంశం ఔషధ ప్రయోగానికి గురిచెయ్యబడే వ్యక్తికి పరీక్షల వలన జరగబోయే అనుకూల, నష్టకర అంశాలను గురించి పూర్తిగా వివరించి అప్పుడు అతని నుండి అనుమతి పొందాలి. ఔషధ పరీక్షలకు అనుమతి నిచ్చేందుకు స్వతంత్ర ప్రతిపత్తిగల నీతి నియమాల కమిటీని ఏర్పాటు చేసి దాని నియంత్రణలో ప్రయోగాలు జరగాలి.

హెల్సింకీ సూత్రాలు మంచివే. అయితే వీటిని అమలు జరపటం ఇష్టంలేని బహుళజాతి కంపెనీలు హెల్సింకీ సూత్రాలను తిరస్కరించి, ప్రభుత్వాధినేతలను లోబర్చుకుని తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. ఈ మందుల కంపెనీలే "మంచి క్లినికల్ ఆచరణ" అన్న సూత్రాలను తావే అమలు జరుపుతామని ప్రకటించాయి. ఇవి రూపొందించింది అమెరికా కంపెనీలే.

ఈ సూత్రాల ఆచరణ ఎలా వుందో ఈ వ్యాసంలోని వివరాలే తెలుపుతున్నాయి. ఈ మందుల కంపెనీలతో చేతులు కలిపి భారత ప్రభుత్వమూ, భారత వైద్య పరిశోధనా మండలి, అఖిలభారత వైద్యశాస్త్రాల సంస్థ వంటివే ఎలాంటి నీతినియమాలు లేకుండా ప్రయోగాలను సాగించి ప్రజలను బలిపశువులను చేస్తున్నాయి. ఈ దోపిడీ పాలకులకు ఎలాంటి నీతి నియమాలూ లేవు.

కనుకనే ఎలాంటి ఆర్థిక ప్రలోభాలూ చూపకుండా, పరీక్షల వల్ల వచ్చే కష్టనష్టాలను ఎలాంటి మినహాయింపులూ లేకుండా వివరించిన తర్వాత స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వ్యక్తులపైనే ఔషధ పరీక్షలు నిర్వహించాలి. అలా స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకున్న వ్యక్తులకు వారి జీవితాంతం వరకూ ఆరోగ్య సేవలకు కంపెనీ హామీ వుండాలి. ఆ పరీక్షవల్ల వారు అనారోగ్యానికి గురైతే, దానికి పూర్తిగా వైద్యం అందించటంతో పాటు, అనారోగ్యం వల్ల అతనికి జరిగిన అన్ని నష్టాలనూ పూరించే బాధ్యత కూడా కంపెనీకి వుండాలి. ఈ రెండు మార్గదర్శక సూత్రాలుగా నియమావళిని రూపొందించి, పరీక్షలను నియంత్రించే అధికారం ఆయా దేశాలకే వుండాలి. అంతర్జాతీయ సంస్థల పేరిట తప్పుడు నీతినియమాలను అంగీకరించరాదు. ఇలాంటి విధానం కొరకు భారత ప్రజలు పోరాడాలి.

#### అనైతిక ఔషధ ప్రయోగాలకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమం

ఆశ్చర్యకరంగా భారత పాలకులు, ప్రభుత్వాలు కఠినతరమైన బ్రిటీష్ నేర శిక్షాస్మృతితో సాయుధులై వుండికూడా ఇలాంటి నేరాలపై ఏ విధమైన చర్యలూ చేపట్టరు. మీసా, పిడిచట్టం, పోటా, ఎస్మా వంటి క్రూర చట్టాలనుపయోగించి తీవ్రవాదానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నామని ప్రకటిస్తున్న పాలకులు-ఈ దేశ సాధారణ ప్రజల తీవ్రమైన జీవన సమస్యల విషయంలో కఠినమైన చర్యలు తీసుకోవటానికి చట్టం అనుమతించటంలేదని అమాయకంగా మాట్లాడుతున్నారు-ఎందువలనంటే ప్రజల జన్మహక్కైన జీవించే హక్కు అనేది విశ్వసించ వీలులేని ఆర్థికాభివృద్ధి, శాస్త్ర పురోగతుల పేరిట ఉద్దేశపూరితంగా దాడికి గురవుతున్నది.

భారత దోపిడీ పాలకులు ఆర్థిక పురోగతి, అభివృద్ధిల కోసం దీనిని ఒక తప్పనిసరి అవసరంగా పరిగణిస్తారనేది నిస్సందేహం! కానీ ప్రజలు ఈ విధమైన చట్టవిరుద్ధమైన దుర్మార్గాన్ని, అవమానవీయ క్రూరత్వాన్ని భరించటానికేమాత్రం సిద్ధంగాలేరు, ఆమోదించరు కూడా. సామ్రాజ్యవాదులకు, వారికి లోబడిన భారత పాలకుల కుట్రలు, కుతంత్రాలకు బాధితులుగా మిగలటానికి వారింకెంతమాత్రమూ సిద్ధంగా లేరు.

సామ్రాజ్యవాదుల అమానవీయ, క్రూరమైన దోపిడీ దాహాన్ని తీర్చే సరుకుగా భారత ప్రజలను మారుస్తున్న ఔషధ ప్రయోగాలను వ్యతిరేకిస్తూ నిర్మించే ప్రజాఉద్యమం ఈ సామ్రాజ్యవాద కుట్రలన్నీ అంతమయ్యే వరకూ కొనసాగించాలి. నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ నిర్మాణ కృషిలో భాగంగా భారత విప్లవకారుల ముందున్న ఒకానొక తక్షణ కర్తవ్యమిది.

# 'ప్రజాపోరాటలను ముందుకు సాగించడమే కా॥ వేమన ఆదినారాయణకు నివాళి!'



కా॥ ఆదినారాయణ స్థూపంవద్ద నివాళులు

**బందరు, 17-6-11 :**

రైతు కూలీ-కార్మిక ప్రజా నాయకుడు కా॥ వేమన ఆదినారాయణ రెండవ వర్థంతి సందర్భంగా తొలుత రైతుబజారు వద్దవున్న కా॥ వేమన ఆదినారాయణ అమరస్థూపం వద్ద తోపుడుబండ్ల వ్యాపారస్తులు రంగబాబు, రాంబాబు, షరీఫ్ పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. రైతుబజారు స్టాఫ్ తరపున ఆనంద్, పకీర్, షరీఫ్, శ్రీనివాస్, ఇ.వో. శ్రీనివాసరావు శ్రద్ధాంజలి ఘటించారు. రైతుబజార్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ముఠా వర్కర్స్; ఎన్.వై.ఎస్. నాయకులు; స్త్రీ విముక్తి సంఘటన నాయకులు పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో వుండి వారికోసం నేనున్నానంటూ ముందుకు వచ్చేవాడని, 'బందరు పట్టణ పరిరక్షణ కమిటి' కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర నిర్వహించాడని ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ బి. సత్యనారాయణసింగ్ అన్నారు.

సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ యద్ధనపూడి సోని మాట్లాడుతూ పాలక పార్టీలన్నీ దీక్షలతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయనీ ఇంతవరకు ప్రపంచ చరిత్రలో నిరాహార దీక్షలతో ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమైనట్లుగా ఎక్కడా లేదని అన్నారు. సమాచార హక్కు చట్టం తెచ్చామని చెప్పిన పెద్దలు ఆ చట్టం సహాయంతో స్విస్ బ్యాంకుల్లో నల్లధనాన్ని దాచిన వారి పేర్లు వివరాలు తెలుకోలేక పోతున్నారనీ, లోక్‌పాల్ బిల్లు వచ్చినా దాని ద్వారా అవినీతి అంతమై పోతుందని చెప్పటం హాస్యస్పదంగా వుందని అన్నారు. ఎవరైతే అవినీతిలో మునిగి తేలుతున్నారో వారే అవినీతి వ్యతిరేక ఆందోళనలో ముందుంటున్నారని, దీనినిబట్టి దాని భవిష్యత్తును అర్ధం చేసుకోవచ్చని సోని అన్నారు.

నిరుపేదల సమస్యలు ఎవరికీ పట్టడం లేదని, పోరాడుతున్న పేద ప్రజలపై పోలీసుబలాన్ని ప్రయోగిస్తున్నారని, తీవ్రమైన నిర్బంధాల మధ్య ప్రజలు నిలబడి , నిలదొక్కుకుని పోరాడుతున్నారని వారికి అండగా వారితో మమేకం కావడమే కా॥ వేమన ఆదినారాయణకు అందించే నిజమైన నివాళిగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి రైతుకూలీసంఘం జిల్లా నాయకులు పామర్తి అంజమ్మ అధ్యక్షత వహించారు. అమరవీరులకు జోహార్లు తెలియజేస్తూ ప్రజాకళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. ✤

# స్థానిక సమస్యల పరిష్కారానికై ఆందోళన

**పిడుగురాళ్ళ, 10-6-11:**

గుంటూరుజిల్లా, పిడుగురాళ్ళలో-లెనిన్‌నగర్ కాలనీ ఏర్పాటై 16 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కనీసపాటి రోడ్లు వేయకపోవటం, ఎక్కడ నీరు అక్కడ ఆగిపోయి చెరువులను తలపిస్తూ దోమలు పెరగటంవలన ప్రజలు అనేక రకాలయిన వ్యాధుల బారిన పడుతున్నారు. కూలీ చేసుకుంటూ జీవిస్తున్న పేద ప్రజలకు వచ్చిన జబ్బులకు వేలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. అంతేకాకుండా బట్టీల ప్రాంతం అవటంతో బట్టీలద్వారా వస్తున్న పొగవలన కాలుష్యం బాగా పెరిగి ప్రజలకు జీర్ణకోశ వ్యాధులు, శ్వాసకోశవ్యాధులు, అల్సర్లు, అనేక రకాలైన చర్మవ్యాధులు సంక్రమిస్తున్నాయి.

గత కొంతకాలంగా బట్టీలలో నాసిరంకం బొగ్గువాడకం వలన పొగ విపరీతంగా రావటంతో పేదప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి నుండి ప్రజలు బయటపడాలంటే అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని; లెనిన్‌నగర్‌లో రోడ్లు వెంటనే మంజూరు చేయాలని, ముఖ్యంగా డ్రైనేజి వ్యవస్థను బాగుచేయాలని, లెనిన్ నగర్‌కి ప్రత్యేకంగా రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని, ప్రజలకు రేషన్ సరుకులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని, అర్హులైన ప్రజలకు, వితంతు, వికలాంగుల పెన్షను, వృద్ధాప్య పింఛన్స్ మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ ఆందోళన చేపట్టారు.

జానపాడురోడ్ ఏపిఎఫ్‌టియు కార్యాలయంనుండి ప్రదర్శన, అనంతరం మున్సిపల్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. కమీషనర్ బయటికివచ్చి పింఛన్లు, నీటి సౌకర్యం, డ్రైనేజి, వీధిలైట్లు, రోడ్లు తక్షణమే వేయిస్తామని హామీయిచ్చారు. అక్కడనుండి ప్రదర్శనగా వెళ్లి తహశీల్దార్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించి, కొత్త రేషన్ కార్డులు, లెనిన్‌నగర్‌లో రేషన్ షాపు ఏర్పాటు చేస్తామన్నమీదట ధర్నా విరమించారు.

పై సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులను కలిసినా హామీలు ఇచ్చారు కానీ సమస్యలను సత్వరం పరిష్కరించటంలేదనీ ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని కాలనీవాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ఎన్.రాంబాబు, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ఎమ్.నిర్మల, నవయువ సమాఖ్య స్థానిక నాయకులు జాని, సుందరరావు, ఆంజనేయులు, సైదా, ఖాసిం తదితరులు డిమాండ్ చేశారు. ✤

**సున్నం-బట్టీల,...** (చివరి పేజీ నుండి)

వారం రోజులు గడిచినా మిల్లులు తెరవలేదు. రెక్కాడితేనేగానీ డొక్కాడని కార్మికులు పనులు లేక అర్థాకలితో ఇబ్బందులకు గురయ్యారు. మూసివేత కాలంలో వారి భృతి గురించి యజమానులుగాని, కార్మికశాఖ అధికారులుగాని, రెవెన్యూ అధికారులుగాని పట్టించుకోలేదు. అందువలన గత్యంతరం లేని పరిస్థితుల్లో పెద్దఎత్తున కార్మికులు సమీకృతులై పిడుగురాళ్ళ పట్టణంలో 21-6-2011న మరల ప్రదర్శన, తాశీల్దారు ఆఫీసువద్ద ఆందోళన చేపట్టారు. ధర్నాలో- అధికారుల నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. తాశీల్దారు కార్మికుల సమక్షంలో ఆరోజే యాజమాన్య సంఘాలను పిలిపించి మాట్లాడతానని, కార్మికసంఘాల నాయకత్వాలు కూడా దీనికి హాజరు కావాలని ప్రకటించారు. తదుపరి కార్మికులు ప్రదర్శనగా కార్మికశాఖ అధికారి కార్యాలయము వరకు వెళ్ళి ధర్నా నిర్వహించి అధికారుల నిర్లక్ష్యవైఖరిని నిలదీశారు. కార్మికశాఖ అసిస్టెంటు కమీషనర్‌ద్వారా యజమానుల సంఘంతో చర్చించి మిల్లులు తెరిపించే ప్రయత్నం చేస్తామని లేదా భృతి కల్పించే ప్రయత్నంచేస్తామనీ ఆయన మరోమారు హామీ ఇచ్చారు.

21-6-2011వ తేదీన యజమానుల సంఘం నాయకులతో తహశీల్దారు చర్చలు జరిపి, 23-06-2011 తేదీకి తిరిగి చర్చలను వాయిదా వేశారు.

22-6-2011వ తేదీన స్థానిక ఎమ్ఎల్ఏ యరపతినేని శ్రీనివాసరావు వద్దకు కార్మికులు ప్రదర్శనగా వెళ్ళి మెమోరాండం యిచ్చి జోక్యం చేసుకొని, సమస్య పరిష్కరించాలని కోరారు.

23-6-2011వ తేదీన తాశీల్దారు యజమానుల మధ్యనున్న సమస్యలపై చర్చించి మిల్లులను, బట్టీలను తెరిపించుటకు అంగీకరింపచేశారు. 24-6-2011 తేదీనుండి మిల్లులు, బట్టీలు తెరిచారు.

మిల్లుల మూసివేత కాలములో సున్నపు పరిశ్రమలోని సంక్షోభంపైన, కార్మికుల సమస్యలపైన ఏపిఎఫ్‌టియు అనుబంధ కార్మిక యూనియన్‌ల ఆధ్వర్యంలో కరపత్రాన్ని ముద్రించి పంపిణీ చేశారు. సున్నపు మిల్లు, బట్టీల ప్రాంతాలైన లెనిన్‌నగర్, చంద్రపాలెం, టిఎన్.నగర్, విశ్వమోహనరెడ్డినగర్‌లలో కార్మికులతో సమావేశాలు నిర్వహించి, మిల్లులు తెరిపించుటకు, కార్మికులందరు ఐక్యంగా ఆందోళనలలో పాల్గొనుటకు సిద్ధంచేశారు. ఈ కార్యక్రమాలలో ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥స్వామి , సున్నంబట్టీల వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జాజుల శ్రీను, వెంకట్రావు, రాజు రైతుకూలీసంఘం నాయకులు కా॥ఎన్.రాంబాబు, పి.కోటేశ్వరరావు; స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥నిర్మల, సున్నపు మిల్లుల వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పొలేసు, మౌలాలి, అస్వాద్, ఇబ్రాయిల్; ఎన్‌వైయస్ నాయకులు జాని, శివ, తదితరులు పాల్గొన్నారు. ✤

**యాక్సిస్ కంపెనీ...** (చివరి పేజీ నుండి)

వెంకాయమ్మ 65 సం॥ల వృద్ధురాలు. రక్త పరీక్షకెళ్తే 7వేలు వస్తాయని ఎవరో చెబితే ఛార్జీలకు అప్పుచేసి వీళ్ళవెంట బయలుదేరింది. తీరా వెంకాయమ్మకు టాబ్లెట్ వేసిన తర్వాత వాంతులవటం వలన ఉత్తీర్ణం కాలేదని ఆమెను మియాపూర్‌లో దిక్కులేకుండా వదిలేశారు. ఎవరూ తెలిసినవాళ్ళు లేక వాళ్ళను వీళ్ళను బతిమాలి ఆమె రైల్వేస్టేషన్‌కు చేరింది. చేతిలో చిల్లిగవ్వలేక తనవూరు చేరేదారి తెలియక వాళ్ళను వీళ్ళను రూపాయి రూపాయి అడుక్కుని పిడుగురాళ్ళ బండి కనుక్కుని బతుకుజీవుడా అనుకుంటూ ఇల్లు చేరుకుంది.

నాగమణికి కూడా టాబ్‌లెట్ వేసిన వెంటనే వాంతులవ్వగానే ఉత్తీర్ణంకాలేదని చెప్పి మియాపూర్‌లో వదిలేశారు. ఐతే ఈమెను అక్కడినుండీ మరో బ్రోకర్ వేరే పరీక్షకు తీసుకెళ్తామని చెప్పి, అక్కడైతే 10వేలు ఇస్తారని ప్రలోభపరిచి చెన్నై తీసుకెళ్ళాడు. ఆ విధంగా మరికొంతమంది చెన్నైలోని మరో ఔషధ ప్రయోగ కేంద్రాలలో ప్రయోగ జంతువులుగా వెళ్ళారు.

టాబ్‌లెట్ మింగిన ఒక గంట తర్వాత రక్తంతీసే ప్రక్రియ ప్రారంభిస్తారు. పశువులకు ఇంజక్షన్ చేసే సిరంజివంటి పెద్దసిరంజితో సిరంజి సగం వరకు 5 ని॥ ఒకసారి చొప్పున 14 సార్లు; 3గం॥ఒకసారి చొప్పున 4 సార్లు, ఇలా రోజు మొత్తంలో 18 సార్లు రక్తం తీశారు. ఈ పరీక్షలన్నీ ముగిసాక మాత్రమే ఆహారం అందజేశారు.

మర్నాడు 1000 రు॥లేదా 1500 రు॥ డబ్బిచ్చి, హామీగా రేషన్‌కార్డు వాళ్ళదగ్గరే వుంచుకొని 'వలంటీర్స్‌ను' ఇళ్ళకు పంపారు. వారం తర్వాత తిరిగివెళ్ళినపుడు మళ్ళీ ఇదే పద్ధతుల్లో రక్తపరీక్ష చేసి 7వేలు కొందరికి, 10వేలు కొందరికి ఇచ్చారు. ఐతే కొంతమందికి 10వేలు ఇస్తామని చెప్పి 3 వేలు మాత్రమే ఇచ్చారు. మరికొందర్ని 2వ విడత, మూడవ విడత వేరే మందులు కూడా వేసి పరీక్ష చేశారు. మందు మారినప్పుడల్లా వాళ్ళకు వేసే యూనిఫాం కూడా మారుతుంది. వారిలో కొంతమంది కాస్త కూస్త చదువుకొని వాళ్ళని వీళ్ళని అడిగి తెలుసుకున్న వారికి రొమ్ముక్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు మందులు కనుక్కున్నారని, చౌకగా ప్రజలందరికీ అందుబాటులోకి తేవటానికి ఈ పరీక్షలు చేస్తున్నారని నమ్మబలికారు.

మరికొంతమంది ఆరోగ్యంగా వున్న యువతులను గర్భసంచి అద్దెకిస్తే పదినెలలు తిండిపెట్టి బాగా చూసుకుంటారని, బిడ్డపుట్టిన తర్వాత 2 లక్షల రూ॥లు డబ్బు చెల్లిస్తారని కూడా బ్రోకర్లద్వారా ప్రలోభపెట్టారు.

ఈ మొత్తం పరీక్షలకు యాక్సిస్‌ల్యాబ్ కేంద్రంగా వుంది. చెన్నైలో వున్న పరీక్షాకేంద్రం ఇంకా వెలుగులోకి రావలసివున్నది.

మరో ముఖ్యమైన విషయం ఈ ల్యాబ్ వద్ద చదువుకున్న యువతీయువకులు కూడా ఈ పరీక్షలకు సిద్ధమై వెళ్ళటం మరింత కలవరాన్ని కలిగించే విషయం.

పిడుగురాళ్ళ నుండీ వెళ్ళిన వారిలో ప్రధానంగా వడ్డెర, మాల, మాదిగ, ముతరాసులు, ఎక్కువగా ముస్లింలు ఔషధ పరీక్షలకు గురైన వారిలో వున్నారు. దాదాపు 4 సం॥ల నుండీ ఈ పరీక్షలు జరుగుతున్నాయని ఇంకా కాలనీలో అనేకమంది ఈ పరీక్షలకు గురైన వారున్నారని, వారు బయటపడేందుకు సిద్ధపడటంలేదని తెలుస్తున్నది. రేయిపగలు రెక్కలు ముక్కలు చేసుకున్నా పూటగడవని స్థితిలో ఇది ఒక ఆదాయవనరుగా కనిపించటం ఒక విషాద వాస్తవం. పేదలు, దళితులు, కార్మికులు ఎక్కువగావున్న పిడుగురాళ్ళ ప్రాంతంలో పైకి కనపడే కార్మికుల్లోని వారే ఐన ఒకరిద్దరు ఏజంట్లకంటే అసలైన బ్రోకర్లు, బహుళజాతి కంపెనీల బ్రోకర్లు ఇక్కడ కేంద్రీకరించారన్నది కూడా ఒక వాస్తవం.

పరీక్షలు పూర్తయి, ఇల్లుచేరిన మహిళలకు వారం, 10 రోజుల అనంతరం ఉన్నట్టుండి తలతిరగటం, నడుము నుండి క్రిందిభాగం చచ్చుబడ్డట్టుగా తిమ్మిర్లెక్కటం, కాళ్ళుచేతులు వణుకురావటం, కళ్ళు మసకరావటంవంటి లక్షణాలు చోటుచేసుకున్నాయి. వీటితోపాటు ఏ పని చేసుకోలేని విధంగా విపరీతంగా నీరసపడిపోవటం జరిగింది.

మన దేశంలో విదేశీ బహుళజాతి మందుల కంపెనీలు, వాటి ప్రాజెక్టులను పొందిన స్థానిక కంపెనీలు మన ప్రజల పేదరికాన్ని , అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరా చేసుకొని డబ్బును ఎరచూపి వారిపై ఔషధ ప్రయోగాలు చేస్తున్నారు. ఈ ఔషధ ప్రయోగాలకి అమెరికాలో అయ్యే ఖర్చుకన్నా నాలుగవ వంతు ఖర్చుతో ప్రయోగాలు పూర్తి చేసి మందులను మార్కెట్‌లోకి తెస్తున్నారు. అతి తక్కువ ఖర్చుతో కోట్లును ఆర్జించేసేందుకు విదేశీ కంపెనీలు, భారత వైద్య పరిశోధన మండలి, భారత క్లినికల్ పరీక్షల రిజిస్ట్రారు అనుమతి తీసుకోకుండా, తీసుకొన్నా అవి రూపొందించిన నియమ నిబంధనలు పాటించకుండా, మానవులపై ప్రయోగాలు చేసి వారి జీవితాలతో ఆటలాడుకొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు వైద్య ఆరోగ్య విషయాలలో బాధ్యత వహించకుండా, విదేశీ కంపెనీల పరిశోధనలకు పేదలు జీవితాలను ప్రయోగశాలగా మార్చి వారి దోపిడీకి అనుమతించారు.

**పిడుగురాళ్ళ, 17-6-11 :**

ఈ నేపథ్యంలో యాక్సెస్ కంపెనీ ఔషధ ప్రయోగాలకి గురైన బాధితులకు న్యాయం జరగాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.), స్త్రీ వివిముక్తి సంఘటన, నవయువ సమాఖ్యల ఆధ్వర్యాన పట్టణంలో 150 మందితో ప్రదర్శన, రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, జీవితాంతం ఆరోగ్య రక్షణ బాధ్యత, కుటుంబ బాధ్యత కంపెనీనే భరించాలని, బాధితులకు తక్షణం 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలనీ, కంపెనీ లైసెన్స్‌లు రద్దు చేయాలనీ, కంపెనీ యాజమాన్యంపై హత్యానేరం చట్టంక్రింద, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం క్రింద అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ తహసిల్దారు ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇచ్చారు. అలాగే పిడుగురాళ్ళ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. తాసీల్దారు దీనిపై వెంటనే స్పందించి బాధితులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మధ్యదళారుల అరెస్టుకు చర్యలు తీసుకున్నారు.

సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కా॥ లక్ష్మారెడ్డి, కా॥ ఉల్లిగడ్డ నాగేశ్వరరావు ఔషధ ప్రయోగ బాధితులను, వారి కుటుంబాలను లెనిన్ నగర్, ఆదర్శనగర్‌లలోనూ, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోను పరామర్శించారు.

ఈ కార్యక్రమాల నిర్వహణలో రైతు కూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ రాంబాబు, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ నిర్మల, నవయువ సమాఖ్య నాయకులు కా॥ జానీ, రాజు, శివ ఇంకా ఇబ్రాయిల్, పొలేసు, సత్యనారాయణ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**గుంటూరు, 22-6-11 :**

ఔషధ ప్రయోగాల కంపెనీ 'యాక్సెస్' బాధితులను పరామర్శించేందుకు స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్రబృందం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులను కలిసింది. ఈ బృందంలో స్త్రీ విముక్తి సంఘటన ప్రధాన కార్యదర్శి కా॥ టి. శ్రీదేవి; రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ కె. అజిత, బి. అరుణ; జిల్లా నాయకులు ఎం. నిర్మల తదితరులు వున్నారు.

బాధితుల, ప్రజాసంఘాల ఆందోళనల మేరకు అధికారులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో పదిహేను మందిని చేర్పించారు. మొదటిరోజు జిల్లా అధికారులు కలెక్టరు, మంత్రి మోపిదేవి వెంకటరమణ తదితరులు బాధితుల్ని పరామర్శించి న్యాయం చేస్తామని హామీలిచ్చి వెళ్ళారు. బాధితులకు ప్రాథమిక వైద్యం మాత్రమే చేసి 22వ తేదీ సాయంత్రం వారిని డిశ్చార్జి చేసి వైద్య అధికారులు చేతులు దులుపుకున్నారు. అవసరమైన పరీక్షలేమీ నిర్వహించలేదు. బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు ఆందోళనకు సిద్ధం కావాలని స్త్రీ విముక్తి సంఘటన పిలుపునిచ్చింది.

**మంగళగిరి, 26-6-11 :**

మంగళగిరిలో బహుళజాతి ఫార్మా కంపెనీల దిష్టిబొమ్మ దగ్ధం



పిడుగురాళ్ళలో-పేద ప్రజలపై మందుల కంపెనీలు జరిపిన ప్రయోగాలను నిరశిస్తూ పి.డి.ఎస్.ఒ-ఎన్.వై.ఎస్.ల ఆధ్వర్యంలో స్థానిక విటిజెఎం & ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల నుండి స్థానిక అంబేద్కర్ బొమ్మ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ బొమ్మ వద్ద ప్రభుత్వ, ఫార్మా కంపెనీల దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా పిడిఎస్ఒ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె. బాజిసైదా, ఎన్.వై.ఎస్. పట్టణ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రజలకు వైద్యం అందించాల్సిన ప్రభుత్వము ఆ బాధ్యతను నెరవేర్చక పోగా, ఫార్మా కంపెనీలకు అండగా నిలబడి విచ్చలవిడిగా ప్రయోగాలకు అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా నిరసించారు.

ఈ కార్యక్రమంలో గీతాకృష్ణ, జోసఫ్, వెంకటేష్, (ఎన్.వై.ఎస్.); మస్తాన్, సతీష్, రాము, (పి.డి.యస్.ఒ), తదితరులు పాల్గొన్నారు. ✤

